# ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం
# 10వ రాష్ట్ర మహాసభలకు
# కార్యదర్శి నివేదిక
(ముసాయిదా)

# ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం 10వ రాష్ట్ర మహాసభలకు

# కార్యదర్శి నివేదిక (ముసాయిదా)

ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం రజతోత్సవ సభలయిన 10వ రాష్ట్ర మహాసభలకు హాజరయిన ప్రతినిధులకు, సౌహార్ద్రప్రతినిధులకు రాష్ట్ర కార్యవర్గం తరపున ఆహ్వానం పలుకుతున్నాను.

9వ రాష్ట్ర మహాసభలు మనం 1996 జనవరి 6, 7 తేదీలలో మహబూబ్‌నగర్‌లో జరుపుకున్నాము. మన నియమావళి ప్రకారం రాష్ట్ర మహాసభలు సంవత్సరానికొకసారి జరగవలసి ఉండగా ఆచరణలో కొంత అస్తవ్యస్తంగా నిర్వహిస్తున్నాము. ఖమ్మంలో 1983లో జరిగిన నాలుగవ మహాసభలు మాత్రమే ఒక సంవత్సరం గడువును పాటించి జరిపాము. తీవ్ర నిర్బంధం కారణంగా 5వ రాష్ట్ర మహాసభలు (విజయవాడలో) నాలుగేళ్ల తరువాతగాని జరపలేకపోయాము. అయితే అప్పటి నుండి రెండేళ్ళకొకసారి మహాసభలు జరపాలన్న నియమం పెట్టుకొని ఆ విధంగా జరుపుతున్నాము. అప్పుడప్పుడు కొద్ది నెలలు ఆలస్యం అయినా మొత్తం మీద గత 10 సంవత్సరాలుగా ఈ నియమం పాటిస్తున్నాము. ఈసారి 2 సంవత్సరాల 9 నెలల గడువు తరువాత మహాసభలు జరపడానికి కారణం అవగాహనపైన చాలా కాలంగా వాయిదా పడుతున్న చర్చను 10వ రాష్ట్ర మహాసభల లోపల ముగించుకోవాలని రాష్ట్ర కమిటీ భావించడమే.

నియమావళిలో సంవత్సరాని కొకసారి మహాసభలు జరపాలని ఉన్నప్పటికీ రెండు సంవత్సరాల కొకసారి జరపడం మాత్రమే ఆచరణసాధ్యం. నియమావళిని సవరించి ఆచరణసాధ్యమయిన నియమాన్నే పెట్టుకోవడం మంచిదేమో.

జిల్లా మహాసభలు ఎప్పుడు జరపాలన్న విషయం నియమావళిలో లేనప్పటికీ రాష్ట్ర మహాసభల కంటె ముందే అన్ని జిల్లాశాఖల మహాసభలు జరగడం ఉచితంగా ఉంటుంది. ఈ నిర్మాణ సూత్రాన్ని మనం పాటించాలని ప్రయత్నం చేస్తున్నాముగానీ ప్రతీసారీ కొన్ని జిల్లా శాఖల సభలు ఏదో ఒక కారణం వల్ల వాయిదాపడి రాష్ట్ర మహాసభల తరువాత జరుగుతున్నాయి.

ఈసారి కూడ 16 జిల్లాశాఖల మహాసభలు జరుగగా 6 వాయిదాపడ్డాయి. (రంగారెడ్డి జిల్లాలో కమిటీయే లేదు). ఇంక మీదనయినా రాష్ట్ర మహాసభల కంటె ముందే జిల్లా శాఖల సభలన్నీ అయ్యేటట్టు చూడాలి.

గడచిన 2 సంవత్సరాల 9 నెలల కాలంలో రాష్ట్ర కమిటీ చేపట్టిన కార్యక్రమాలను మొదట సమీక్షించుకుని ఆ తర్వాత జిల్లాలలో చేపట్టిన కార్యకలాపాలను స్థూలంగా సమీక్షించుకుందాం. కార్యక్రమాలను సమీక్షించుకునే క్రమంలోనే దేశంలోనూ రాష్ట్రంలోనూ ప్రజలు ఎదుర్కుంటున్న పౌరహక్కుల పరిస్థితిని కూడ విశ్లేషించుకుందాం. ఈ కార్యక్రమాలు చేపట్టినప్పుడు రాష్ట్ర కమిటీ, లేక రాష్ట్ర కమిటీ బాధ్యులు, అప్పటికి తమకున్న అవగాహన ప్రకారం చేపట్టడం జరిగింది. ఆ తరువాత పౌరహక్కుల అవగాహన గురించి సంస్థలో జరిగిన చర్చ, తీసుకున్న నిర్ణయాల నేపథ్యంలో ఇక మీదట అటువంటి కార్యక్రమాలు చేపట్టేటప్పుడు, లేక అటువంటి విషయాలకు స్పందించేటప్పుడు, ఏ వైఖరితో స్పందించాలో, ఏ విధంగా వ్యవహరించాలో ఈ మహాసభ చర్చించి నూతన కార్యవర్గానికి గైడెన్స్ ఇస్తుందని ఆశిస్తాము.

1. మహబూబ్‌నగర్ మహాసభల తరువాత రాష్ట్ర కమిటీ చేపట్టాలని తలపెట్టిన మొదటి కార్యక్రమం ప్రైవేట్ సెక్టర్‌లో రిజర్వేషన్లు అనే అంశంపైన సదస్సు. నూతన ఆర్థిక విధానాల ఫలితంగా దేశ ఆర్థిక వ్యవస్థ వేగంగా ప్రైవేట్ పెట్టుబడిదార్ల చేతిలోకి పోవడంవల్ల ఉద్యోగాలలో ఎస్‌సి ఎస్‌టి బీసి కులాలు, స్త్రీలు సాధించుకున్న రిజర్వేషన్లు కాలక్రమంలో నిష్ప్రయోజనంగా మారే పరిస్థితి ఏర్పడింది. ఈ రిజర్వేషన్లన్నీ ప్రస్తుతం ప్రభుత్వ రంగానికే పరిమితమయి ఉన్నాయి. అందువల్ల ఇప్పుడున్న రిజర్వేషన్లను ప్రైవేట్ రంగానికి కూడ వర్తింప జేయాలన్న డిమాండ్ పెట్టడం అవసరం. లేకపోతే ఉన్న కొద్దిపాటి ఉద్యోగాలు మళ్లీ అగ్రవర్ణాలకూ మగవాళ్లకు మాత్రమే దక్కే ప్రమాదం ఉంది.

ఈ ప్రమాదం ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవాలంటే ప్రస్తుతం ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు ఎవరికి లభిస్తున్నాయో చూడాలి. అందుకోసం అన్ని జిల్లాల్లోనూ ప్రైవేట్ రంగంలోని విద్య, పారిశ్రామిక, వర్తక, వాణిజ్య సంస్థలలో వివిధ హోదాలలోని ఉద్యోగాలలో ఏ కులం వాళ్లు ఎంత మంది ఉన్నారో స్త్రీపురుషుల దామాషా ఏ విధంగా ఉందో పరిశీలించడం అవసరం అని భావించాము. ఒక్కొక్క జిల్లా శాఖ కొన్ని ప్రైవేట్ రంగసంస్థలను 'సాంపిల్'గా తీసుకొని సర్వే జరపాలనీ ఈ విధంగా సేకరించిన సమాచారంతో ఒక ప్రచురణ తీసుకొచ్చి, రేపు ప్రైవేటీకరణ సంపూర్ణ రూపం తీసుకుంటే ఎస్‌సి ఎస్‌టి బీసి కులాలు, స్త్రీల ఉద్యోగాల

పరిస్థితి ఏ విధంగా ఉంటుందో వివరిస్తూ సదస్సు నిర్వహించాలని అనుకున్నాం. రాజ్యాంగంలో ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లకు ఏ మేరకు అవకాశం ఉందన్న విశ్లేషణను కూడ ఆ ప్రచురణలో చేర్చాలనుకున్నాము. ఈ సదస్సు రెండు సార్లు వాయిదా పడి 1996 సెప్టెంబర్ 15న వరంగల్‌లో జరిగింది. ఆశించినట్టు అన్ని జిల్లా శాఖలూ ప్రైవేట్ రంగ సంస్థలపైన సర్వే జరపక పోవడం వల్ల, కొన్ని జిల్లా శాఖల నుండి మాత్రమే రాష్ట్ర కమిటీకి సమాచారం అందడం వల్ల, అనుకున్నట్టు ప్రచురణ తీసుకురాలేక పోయాము. కరపత్రంతో సరిపెట్టుకున్నాము.

ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు ఒక హక్కుగా దక్కాలంటే పెద్ద ప్రజా ఉద్యమం అవసరం. అటువంటి ఉద్యమం నిర్వహించడం పౌరహక్కుల సంఘానికి సాధ్యమయ్యే పని కాకపోయినప్పటికీ, కనీసం ఆ ఆవశ్యకతను వివరిస్తూ ప్రచారం చేయడం మనం చేయవలసిన పనేనని భావించి ఈ కార్యక్రమం చేపట్టాము. కానీ మనం ఒక సదస్సు మినహా వేరే ప్రచారమేమీ చేయలేకపోయాము. సదస్సు బాగానే జరిగినప్పటికీ అంతకంటే ఎక్కువ చేయలేకపోవడం మన పరిమితిగానే భావించాలి. అయితే విభిన్న అణచివేత రూపాలకు మనం ఇచ్చే ప్రాధాన్యతల గురించి, మన కర్తవ్యం గురించి సంస్థలో జరిగిన చర్చ నేపథ్యంలో ఈ కార్యక్రమానికి ఎంత ప్రాముఖ్యం ఇచ్చేదీ సంస్థ ఇక మీదట నిర్ణయించుకోవాలి.

2. సిమెంట్ కాలుష్యం సమస్యపైన వివరమైన నివేదిక ప్రచురించాలన్న నిర్ణయం కూడ మొదటి కార్యవర్గ సమావేశంలోనే తీసుకున్నాము. పారిశ్రామిక కాలుష్యాన్ని గురించి మనదేశంలో ఇప్పటికీ చైతన్యం తక్కువే ఉంది. మూడవ ప్రపంచదేశాలు పారిశ్రామిక ప్రగతికి కేంద్ర స్థానం ఇచ్చి పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన దేశాలను వేగంగా అందుకోవడం తమ లక్ష్యంగా పెట్టుకోవడం వల్ల, ఈ ఆత్రుత ఎవరికి ఎంత నష్టం చేస్తుందన్న ఆలోచనకు తావులేకుండ పోయింది. పరిశ్రమలలో పని చేసే కార్మికులు, పరిశ్రమల చుట్టూ నివసించే ప్రజలు ఆత్రుతకు మూల్యం చెల్లించుకుంటారు. కార్మిక సంఘాలు కార్మికులకు కొంత రక్షణ కల్పించాయి గానీ పారిశ్రామిక కాలుష్యం వల్ల నష్టపోయే ప్రజానీకం జీవితాలనూ జీవనాన్నీ కాపాడే కాలుష్యనివారణ ఉద్యమాలు మనదేశంలో చాలా బలహీనంగా ఉన్నాయి. వాటికి కావలసిన చైతన్యాన్ని ప్రజలకు కల్గించే బాధ్యత పౌరహక్కుల ఉద్యమంపైన ఉంది. చట్టాలలో మార్పుకోసం కృషి చేసే అవకాశం కూడ ఉంది. పర్యావరణపరిశుభ్రత జీవించే హక్కులో భాగమనీ, అంటే అది ప్రజల ప్రాథమిక హక్కనీ సుప్రీం కోర్టు ప్రకటించిందిగానీ ఆ గుర్తింపుకు తగినంత బలమైన కాలుష్య నివారణ యంత్రాంగంగానీ చట్టాలుగానీ రూపొందలేదు. ఆ దిశగా జరగగల కృషిలో కూడ పౌరహక్కుల ఉద్యమానికొక పాత్ర ఉంది.

సిమెంటు కాలుష్యాన్ని ఒక ఉదాహరణగా తీసుకొని ఆ అవగాహన, చైతన్యం ప్రజలలో కలిగించాలని మనం నిర్ణయం తీసుకున్నాం. భారత దేశంలో సిమెంటు పరిశ్రమ బాగా అభివృద్ధి చెందిన రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ ఒకటి. అది ఎక్కువగా గ్రామీణ ప్రాంతాలలో, ముడిసరుకుకు సమీపంలో ఉండే పరిశ్రమ కావడంతో సిమెంట్ కాలుష్యం వల్ల దెబ్బతినేది వ్యవసాయం, గ్రామీణ రైతాంగం.

సిమెంట్ కాలుష్యంపైన మన సర్వే 1996 వేసవి కాలంలో పూర్తిచేయాలనుకున్నాం. 1998లో గానీ అది పూర్తికాలేదు. ఆనాడు ప్రచురించాలనుకున్న నివేదికను ఈ మహాసభల సందర్భంగా ప్రచురించాము. సిమెంటు కాలుష్యానికి సంబంధించి కాలుష్య నియంత్రణ బోర్డు నెలకొల్పిన ప్రమాణాలను అమలు చేయించడమే కాక, ఆ ప్రమాణాలు ఎంతవరకు సరిపోతాయని ప్రశ్నించవలసిన అవసరం కూడ ఉందని నివేదికలో చెప్పాము. ఆరు జిల్లాలలో 27 ఫ్యాక్టరీలను పరిశీలించిన అనుభవంతో ఒక సమగ్రమైన అవగాహన ఇవ్వగలిగాము. ఈ కృషిని ప్రచార రంగంలోనూ న్యాయస్థానాలలోనూ కొనసాగించవలసి ఉంది.

3. ఎన్‌కౌంటర్ల గురించి జాతీయ మానవ హక్కుల కమిషన్ తన నివేదికను 1996 నవంబర్ నెలలో ఇచ్చింది. 1994లో మనం ఎన్‌కౌంటర్ల గురించి జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు ఇవ్వడం, ఆ సంవత్సరం కమిషన్ ఆంధ్రప్రదేశ్‌లోని పరిస్థితులను అర్థం చేసుకోవడానికి ఇక్కడి కొచ్చి తెలంగాణ జిల్లా కేంద్రాలలో సమావేశాలు నిర్వహించినప్పుడు పోలీసులూ వాళ్ల ప్రోత్సాహంతో నక్సలైట్ బాధితులూ అల్లరి చేయడం, ఆ తరువాత జాతీయ మానవ హక్కుల కమిషన్ 6 కేసులపైన వివరంగా విచారణ జరపడానికి నిర్ణయించడం, వాటిలో 5 కేసులపైన విచారణ 1995లో హైదరాబాద్‌లో జరగడం, తెలిసిన విషయాలే. ఆ 5 కేసులలో నమోదయిన సాక్ష్యాల గురించి, ఎన్‌కౌంటర్‌లకు సంబంధించిన చట్టపరమైన స్థితి గురించి వాదోపవాదాలు 1996 జనవరి, ఫిబ్రవరి నెలల్లో ఢిల్లీలో జరిగాయి. ఏపిసి ఎల్‌సి తరపున కన్నబిరాన్ గారు వాదించారు. పోలీసులు చేసే హత్యలపైన చట్టం కన్నుపడడానికి వీలులేదని వాదించడానికి ప్రభుత్వ న్యాయవాదులు విఫల యత్నం చేసారు.

అయితే వాదోపవాదాలు ముగిసిన తరువాత చాలా కాలానికి కూడ జాతీయ మానవ హక్కుల కమిషన్ తన నివేదిక సమర్పించిక పోవడం చూసి మనం ఆందోళన చెంది కమిషన్ చైర్మన్‌కు ఉత్తరం రాసాము. 1996 నవంబర్ నెలలో కమిషన్ తన నివేదికను రాష్ట్ర

ప్రభుత్వానికి ఇచ్చింది. అందులో మన వాదనలను దాదాపు పూర్తిగా అంగీకరించింది. ఎన్‌కౌంటర్ అనేది చట్టం కళ్లల్లో ఒక నేరమనీ, దానిపైన కేసుపెట్టి ఇన్వెస్టిగేట్ చేయాలనీ అనింది. ఇన్వెస్టిగేషన్‌లో న్యాయం జరగాలంటే స్థానిక పోలీసులు కాక, కొంతమేరకైనా వారి నుండి స్వతంత్రంగా ఉండే యంత్రాంగం నేరపరిశోధన చేపట్టాలని చెప్పింది. ఆ నేరపరిశోధన నివేదికను కోర్టులో దాఖలు చేయాలని అనింది. ఆ నేరం ఆత్మరక్షణలో జరిగిందా లేదా అన్నది కోర్టులో నిర్ణయం కావాలని అనింది. పోలీసులు నక్సలైట్లను కాల్చేసి, చచ్చిపోయిన వాళ్లపైన హత్యా ప్రయత్నం కేసుపెట్టి, వాళ్ల చనిపోయారు కాబట్టి కేసు మూసేస్తున్నామని ప్రకటించే పద్ధతి చట్టాన్ని అపహాస్యం చేసే పద్ధతి అని తీవ్రంగా విమర్శించింది. ఆంధ్రప్రదేశ్‌లో కమిషన్ విచారించిన అయిదు కేసులపైనా సిబిసిఐడి పరిశోధన జరిపించాలని ఆదేశం ఇచ్చింది. ఒక్కకేసులో 1 లక్ష రూపాయల నష్టపరిహారం కూడ ఆదేశించింది.

1997లో జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు జస్టిస్ వెంకటాచలయ్య చైర్మన్ అయిన తరువాత ఈ నివేదిక సారాంశాన్ని దేశంలోని అన్ని రాష్ట్రాలకూ పంపుతూ దీనిని అందరూ అమలు చేయాలని చెప్పారు. అంటే ఎక్కడ పోలీసులు ఎన్‌కౌంటర్ పేరిట చంపినా దానిపైన నేరం నమోదు చేసి స్వతంత్రమైన నేరపరిశోధన జరిపించాలనీ అది నిజమైన ఎన్‌కౌంటరా కాదా అన్నది కోర్టు నిర్ణయించాలనీ అన్నారు.

ఈ ఆదేశాన్ని ఇప్పటివరకు ఏ రాష్ట్ర ప్రభుత్వమూ అమలు చేయక పోయినప్పటికీ 'ఎన్‌కౌంటర్ అంటే హత్యే' నన్న సూత్రీకరణ జాతీయ మానవ హక్కుల కమిషన్ చేత చెప్పించడం సూత్రప్రాయంగా మనకొక విజయంగానే భావించాలి. దానిని అమలు చేయించుకోవడం కోసం భవిష్యత్తులో కృషి చేయవలసి ఉంది.

4. మన రాష్ట్రంలో మానవ హక్కుల కోర్టుల ఆవిర్భావం కూడ 1996లోనే జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం అన్ని జిల్లాల మొదటి అదనపు జిల్లా జడ్జి కోర్టులను మానవ హక్కుల కోర్టులుగా ప్రకటించింది. ఇది కూడ ఒక రకంగా మన కృషి ఫలితమే. 1994 అసెంబ్లీ ఎన్నికలప్పుడు ఒక వారం దినాలలో 36 ప్రాణాలు తీసిన ఎన్‌కౌంటర్ల పైన మనం హైకోర్టులో వేసిన రిట్ పిటిషన్‌లో, మానవ హక్కుల పరిరక్షణ చట్టం (1993)ను అనుసరించి ప్రతీ జిల్లాలోనూ ఒక మానవ హక్కుల కోర్టు నెలకొల్పవలసిందిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని హైకోర్టును అడిగాము. దానిపైన కోర్టులో వాదోపవాదాలు జరుగుతుండగానే రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ జిల్లాలోనూ మానవ హక్కుల కోర్టులు నెలకొల్పుతున్నట్టు ప్రకటించి ఒకటవ అదనపు జిల్లాజడ్జిని మానవ హక్కుల కోర్టు జడ్జిగా ప్రకటించింది.

అయితే ఈ కోర్టుల పరిస్థితి చాలా గందరగోళంగా ఉంది. అవి ఏ నేరాలను విచారించాలో ఎవరినేరాలు విచారించాలో ఏ పద్ధతిలో విచారించాలో ఏ శిక్షలు వేయాలో ఏదీ స్పష్టంగా లేదు. నేరవిచారణ కాక వాటికి వేరే ఏమైనా అధికారాలు ఉన్నాయా అనేది కూడ స్పష్టంగా లేదు. ఈ గందరగోళం చాలనట్టు మన రాష్ట్ర హైకోర్టు మరికొంత సృష్టించింది. మానవ హక్కుల కోర్టు నేరుగా కేసులు చేపట్టడానికి వీలు లేదనీ కింది కోర్టు కమిట్ చేసిన కేసులు మాత్రమే చేపట్టాలనీ తీర్పు ఇచ్చింది. వేరే ఏ స్పెషల్ కోర్టుకూ ఇటువంటి పరిమితి లేదు. మొత్తానికి ప్రస్తుత పరిస్థితి ఏమిటంటే ఈ మానవ హక్కుల కోర్టులు జడ్జిల ఇష్టాన్ని బట్టి పని చేస్తున్నాయే తప్ప ఒక మానవ హక్కుల పరిరక్షణ వ్యవస్థగా పనిచేయడం లేదు. చట్టానికే స్పష్టమైన సవరణలు చేర్చి ఈ కోర్టులకు అర్థవంతమైన రూపం ఇయ్యవలసి ఉంది. ఈ విషయం మనతో సహా చాలామంది జాతీయ మానవ హక్కుల కమిషన్ దృష్టికి తీసుకుపోగా ఆ కమిషన్ ఇప్పుడు మాజీ భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అహ్మదీ నేతృత్వంలో ఈ విషయాన్ని పరిశీలించడానికొక కమిటీని వేసింది. మనం ఆ కమిటీకి తగిన సూచనలు పంపించి దాని కృషి సఫలం అయ్యేటట్టు చూడాలి.

5. 1995తో పోలిస్తే 1996లో ఎన్‌కౌంటర్లు చాలా ఎక్కువ జరిగాయి. 1995 లో 67 మంది ఎన్‌కౌంటర్లలో చనిపోగా 1996లో మొత్తం 161 మంది చనిపోయారు. ఆ సంవత్సరం అక్టోబర్ నెలలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో మనం ఈ విషయాన్ని చర్చించి, దేశంలోని ఇతర రాష్ట్రాల్లో పనిచేస్తున్న పౌరహక్కుల సంఘాలను ఆహ్వానించి ఆ సంవత్సరం డిసెంబర్ నెలలో ఉత్తర తెలంగాణాలో జరుగుతున్న ఎన్‌కౌంటర్ల గురించి నిజనిర్ధారణ కమిటీ పర్యటన నిర్వహించాలని అనుకున్నాము. ఈ పర్యటనకు ముగింపుగా నిజామాబాద్‌లో నర్రా ప్రభాకర్ రెడ్డి వర్ధంతి సభను నిర్బంధ వ్యతిరేక సభగా నిర్వహించాము. ఈ పర్యటనలో మనతోబాటు ఎపిడిఆర్ (పశ్చిమబెంగాల్), సిపిడిఆర్ (బొంబాయి) ఎల్‌హెచ్‌ఎస్ (మహారాష్ట్ర), పియుడిఆర్ (ఢిల్లీ), ఎంఎఎస్ఎస్ (అస్సాం), పిడిఎఫ్ (కర్నాటక), పియుసిఎల్ (తమిళనాడు, పాండిచ్చేరి), ఒపిడిఆర్ (ఆంధ్రప్రదేశ్) పాల్గొన్నాయి. ఈ కమిటీ నివేదిక మర్డర్స్ మోస్ట్ ఫౌల్ (Murders most foul) అనే పేరుతో ప్రచురించి దాదాపు దేశ వ్యాప్తంగా అన్ని పౌరప్రజాస్వామ్య హక్కుల సంస్థలకూ పంపించాము.

6. 1996లో కాశ్మీర్‌లో భారత సైనిక బలగాల చేతిలో జలీల్ అహ్మద్ అంద్రబీ అనే మానవ హక్కుల న్యాయవాది హత్య జరిగింది. అతనిని సైనిక బలగాల పోషణలో ఉన్న ప్రైవేట్ దుండగులు బలవంతంగా గుంజుకు పోయి ఒక సైనిక అధికారికి అప్పగించగా ఆ

తరువాత సైన్యం క్యాంపులో అతనిని హింసించి చంపారు. 1996 మార్చి 8న అతని అపహరణ జరగగా 27న అతని మృతదేహం శ్రీనగర్‌లోనే జీలం నదిలో దొరికింది. అదే సంవత్సరం మే 17న అస్సాంలో మానవ అధికార సంగ్రామ్ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడయిన పరాగ్ కుమార్ దాస్‌ను గౌహతిలో ప్రభుత్వ అనుకూల మిలిటెంట్లు (సల్ఫా'కు చెందినవారు) కాల్చి చంపారు.

ఈ యిద్దరు మానవ హక్కుల కార్యకర్తల హత్య గురించి మనం విస్తృతంగా ప్రచారం చేపట్టాము. వీరితో పాటు పంజాబులో జస్వంత్‌సింగ్ ఖల్రా హత్యను, నాగాలాండ్‌లో జడ్.వి. యావ్ పీ హత్యను కూడ జత చేసి ప్రచారం చేపట్టాము. అకాలీదళ్ మానవ హక్కుల సెల్ బాధ్యుడయిన ఖల్రా పంజాబులో పోలీసులు, సైన్యం గుర్తు తెలియని శవాలుగా ఖననం చేసిన వారి గురించి అన్వేషణ ప్రారంభించినందుకు అతనిని 1995లో మాయం చేసారు. యావ్ పీ కూడ సైన్యం అపహరించి తీసుకుపోయిన వారి గురించి సివిల్ అధికార్లపైన ఒత్తిడి పెడుతున్న న్యాయవాది. అతనిని 1996 మే 23న సైన్యం పురమాయింపు మీద దుండగులు కాల్చి చంపారు.

ఈ నలుగురు పనిచేస్తున్న ప్రాంతాలలోనూ మిలిటెంట్ జాతి ఉద్యమాలు నడుస్తున్నాయి. జాతి స్వయం నిర్ణయాధికారం ఐక్యరాజ్య సమితి రూపొందించిన పౌరరాజకీయ హక్కుల ఒడంబడికలోనూ అంతర్జాతీయ మానవ హక్కుల ప్రకటనలోనూ గుర్తింపు పొందిన హక్కే అయినప్పటికీ భారత ప్రభుత్వం ఈ ఉద్యమాలతో రాజకీయంగా వ్యవహరించి వాటి వెనుక ఉన్న ఆకాంక్షలకు సమాధానం చెప్పేబదులు, వాటి సాయుధ చర్యలనే ఏకైక విషయం చేసి సైన్యాన్ని ప్యారా మిలిటరీని దించి నరమేధం సాగిస్తున్నది. దీని పట్ల నిరసన తెలిపి న్యాయం కోసం కృషి చేస్తున్న పై నలుగురు మానవ హక్కుల కార్యకర్తలనూ ప్రభుత్వ బలగాలే చంపించాయి. మనం ఈ విషయాలన్నీ వివరిస్తూ 1996 సెప్టెంబర్ నెలలో డా॥ రామనాథం 11వ వర్ధంతి సందర్భంగా రాష్ట్ర వ్యాపితంగా కరపత్రం వేసి సభలు పెట్టి ప్రచారం చేసాము.

7. పీపుల్స్‌వార్‌పైన నిషేధాన్ని మరొక సంవత్సరం పొడిగిస్తూ 1996లో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో రాష్ట్ర వ్యాపితంగా దానిపట్ల నిరసన తెలుపుతూ సంతకాల సేకరణ చేసి ప్రభుత్వానికి పంపించాలని నిర్ణయించుకున్నాము. ఒక్కొక్క జిల్లా నుండి కనీసం 1000 సంతకాలు సేకరించి, మొత్తం 20 వేల సంతకాలకు తక్కువ కాకుండ ప్రభుత్వానికి పంపించాలనుకున్నాము. ఈ సంతకాలు కేవలం పీపుల్స్‌వార్ రాజకీయాలను సమర్థించే వాళ్ల నుండే కాక వాళ్లతో రాజకీయంగా విభేదించేవాళ్ల నుండి కూడ ప్రయత్న పూర్వకంగా సేకరించాలనుకున్నాము. ఆ పార్టీపైన నిషేధాన్ని పౌరహక్కుల దృక్పథంతో ఎందుకు వ్యతిరేకిస్తున్నామో తెలియజేసే వివరణను అచ్చువేసి అన్ని జిల్లాలకూ పంపించడం జరిగింది. ప్రభుత్వం నిషేధిస్తున్నది పీపుల్స్‌వార్ చేసే హింసను కాదనీ అది ఎప్పుడో నేరస్మృతిలోనే సంపూర్ణంగా నిషేధించబడిందనీ, ఇప్పుడు ప్రభుత్వం నిషేధిస్తున్నది ఆపార్టీ రాజకీయాలననీ అందులో వివరించాము. మనం సమర్థిస్తున్నది హింస చేసే హక్కును కాదనీ రాజకీయ పంథానూ అభిప్రాయాలనూ స్వేచ్ఛగా ఎంపిక చేసుకొని ఆచరించే హక్కునేననీ వివరించాము. ఆక్రమంలో జరిగే హింస ఏదయినా ఉంటే దానిని నిరోధించే అధికారం, శిక్షించే అధికారం ప్రభుత్వానికి ఉంటాయి గానీ రాజకీయాలను నిషేధించే అధికారం ఉండడం అప్రజాస్వామికమనీ వివరించాము. ఈ అవగాహనను వివరించి సంతకాలు సేకరించి పంపించమని రాష్ట్ర కార్యవర్గం జిల్లా కమిటీలను కోరింది. అయితే ఇప్పటిదాకా 1700 సంతకాలు మాత్రమే సేకరించి పంపించారు. అందులో అత్యధికం మహబూబ్‌నగర్ జిల్లావి కాగా పశ్చిమ గోదావరి, నల్గొండ, చిత్తూరు, కృష్ణా, అనంతపురం, కడప, మెదక్ జిల్లాలనుండి, హైదరాబాద్ నుండి కొన్ని సంతకాలున్నాయి. కేవలం 1700 సంతకాలతో ప్రభుత్వానికి మెమోరాండం ఇవ్వడం బాగుండదు కాబట్టి ఇవ్వలేదు. ఒక్కొక్క జిల్లా నుండి కనీసం 1000 సంతకాలు సేకరించి పంపించమని రాష్ట్ర కమిటీ మరొక్కసారి జిల్లా కమిటీలకు జ్ఞాపకం చేసినప్పటికీ చాలా జిల్లాల నుండి స్పందన లేదు.

పీపుల్స్‌వార్‌పైన నిషేధం ఇంకా కొనసాగుతున్నది కాబట్టి ఇక మీదనయినా సంతకాల సేకరణ పూర్తి చేసి అనుకున్న కార్యక్రమం ముగించాలి. గుంటూరు స్పెషల్ జనరల్ బాడీ ఆమోదించిన అవగాహన వెలుగులో ఈ కార్యక్రమం ఏ రూపంలో కొనసాగించాలో నూతన కార్యవర్గం నిర్ణయించాలి.

8. 1996లోనూ మళ్లీ 1998లోనూ జరిగిన పార్లమెంటు ఎన్నికల - సందర్భంగా ఎన్నికలు ప్రజాస్వామ్యం అనే అంశం మీద వివరంగా కరపత్రం వేసి ప్రచారం చేపట్టాము. ఎన్నికల వ్యవస్థ ప్రజల అభీష్టానికి అద్దం పట్టినప్పుడే ప్రజాస్వామ్యంలో దానికి సార్థకత ఉంటుందనీ, అందుకు భిన్నంగా దానిని అధికార దాహానికీ అధికారానికి సంబంధించిన కొట్లాటలకూ ఒక పరికరంగా మార్చే వైఖరిని నిరసించాలనీ ప్రజలకు వివరిస్తూ, ఎన్నికల పట్ల చైతన్యవంతంగా వ్యవహరించమని ప్రజలకు అప్పీల్ చేస్తూ కరపత్రం వేసాము. ఎన్ని ప్రజాసమస్యలు ఎన్నికల సందర్భంగా చర్చకు రావలసి ఉండిందో, అవి ఏ విధంగా రాకుండ పోతున్నాయో వివరించాము. ఎన్నికల సందర్భంగా చేసే పౌర హక్కుల ప్రచారం జిల్లా కేంద్రాలలో తాలూకా కేంద్రాలలో బహిరంగ సభలు నిర్వహించే రూపంలో కాక పాద యాత్రల రూపంలో చేస్తేనే ఎక్కువ మందికి మన సందేశం అందించగలుగుతాం. గతంలో, ముఖ్యంగా ఫాక్షన్ ప్రాబల్యం ఉన్న

రాయలసీమ ప్రాంతాలలో ఆ విధంగానే చేసాము. 1996 ఎన్నికలప్పుడు చిత్తూరు, అనంతపురం జిల్లాల్లో ఆ పద్ధతిలోనే జరిగింది. అయితే 1998 ఎన్నికలప్పుడు కేవలం కరపత్రాలు పంచడానికి, బహిరంగ సభలకు మాత్రమే పరిమితం అయ్యాము.

ఎన్నికల విషయంలో మనకు చాలాకాలం వరకు ఒక పరిమితమైన కార్యక్రమం మాత్రమే ఉండింది. ఎన్నికల బహిష్కరణ కోసం పీపుల్స్‌వార్ కృషి చేస్తున్న ప్రాంతంలో ఆ ఉద్యమంపైన అమలవుతున్న నిర్బంధాన్ని వ్యతిరేకించడం, జనశక్తి, న్యూడెమోక్రసీ వంటి పార్టీలు ఎన్నికలలో పాల్గొనే ప్రాంతంలో వారి ప్రచారంపైన అమలవుతున్న నిర్బంధాన్ని వ్యతిరేకించడం మన కార్యక్రమంగా ఉండింది. అందువల్ల వోటు వేసే హక్కు ఉంది, బహిష్కరించే హక్కు ఉంది, అన్నది మన ప్రధాన నినాదమయింది. ఎన్నికల గురించి మనకంటూ ఒక అవగాహన ఉండలేదు. అందువల్ల ఒక కార్యక్రమమూ ఉండలేదు. అయితే ప్రజాస్వామ్యంలో ఒక కీలకమైన ప్రక్రియ అయిన ఎన్నికల వ్యవస్థ గురించి పౌరహక్కుల సంఘానికి తనదంటూ ఒక అవగాహన లేకపోవడం ఒక లోపమే. ఈ విషయంలో సంస్థలో ఏకాభిప్రాయం లేకపోవడం వల్లనే మనం ఎన్నికల విషయంలో చొరవగా వ్యవహరించలేక పోయాము. ఇప్పుడు అవగాహన గురించి సంస్థలో జరిగిన చర్చ వెలుగులో సంస్థ రాబోయే రోజులలో ఎన్నికల విషయంలో తన కార్యక్రమాన్ని స్పష్టంగా రూపొందించుకోవలసి ఉంటుంది. దీని గురించి ఈ మహాసభ సూచనలిస్తుందని ఆశిస్తాము.

9. చిలకలూరిపేట కేసులో చలపతి, విజయవర్ధనరావులకు ఉరిశిక్ష తప్పించడానికి మనం చేసిన కృషి కూడ 1996లోనే ప్రారంభమయింది. వాళ్ళకు సెషన్స్ కోర్టు వేసిన ఉరిశిక్షను హైకోర్టు ధృవీకరించిన తరువాత సుప్రీంకోర్టులో న్యాయవాదిని పెట్టుకునే స్థోమత తమకు లేదని వాళ్లు తెలియజేయగా మనమే చొరవ తీసుకొని పియుడిఆర్ కు చెందిన రవీంద్రభట్‌ను న్యాయవాదిగా ఏర్పాటు చేసాము. ఆయన తనకంటే సీనియర్ న్యాయవాదుల చేత వాదింపజేసినప్పటికీ 1996 ఆగస్ట్ 28న సుప్రీంకోర్టు ముద్దాయిల అప్పీల్‌ను కొట్టేసింది. ఆ తరువాత వారికి మిగిలినది రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 72, 161 ల కింద రాజ్యానికి క్షమాభిక్ష పెట్టడానికి ఉండే అధికారం ఒక్కటే. మొదటిది రాష్ట్రపతికీ రెండవది గవర్నర్‌కూ ఉన్నాయి. ఈ యిద్దరికీ పిటిషన్లు రాసి వారి వద్దకు పౌరహక్కుల సంఘాల బాధ్యుల, మేధావుల, ప్రతినిధి బృందాలను తీసుకుపోయి మన విజ్ఞప్తిని వివరించడానికి కృషి చేసాము. కొంతకాలం తరువాత దళిత సంఘాలు కూడ ఈ ఉద్యమంలో కలవడం వల్ల ఉద్యమానికి బలం పెరిగింది. వివిధ దళిత సంఘాలతోనూ ఇతర ప్రజాసంఘాలతోనూ కలిసి ఈ యిద్దరి ఉరిశిక్షరద్దు కోసం ఐక్య కార్యాచరణ కమిటీ ఏర్పాటు చేసి అందులో మనం చురుగ్గా పాల్గొన్నాము. దేశంలోని ఇతర రాష్ట్రాల పౌరహక్కుల సంఘాలను (ముఖ్యంగా ఢిల్లీలోని సంస్థలను, ప్రజాస్వామిక వాదులను) కదిలించడానికి కృషి చేసాము.

ఉరిశిక్ష పూర్తి రద్దు మన 1980 నాటి లక్ష్య ప్రకటనలోనే ఉన్నప్పటికీ ఈ డిమాండ్‌తో మనం ఆ మధ్య కాలంలో ఒక ఉద్యమం ఎప్పుడూ చేపట్టలేదు. ఈ డిమాండ్‌ను ప్రజలకు వివరించి చెప్పవలసిన అవసరంగానీ సందర్భంగానీ మనకింతకు ముందు ఎప్పుడూ రాలేదు. చిలకలూరిపేట కేసుతో మనకు ఆ సందర్భమే కాక అవసరమూ వచ్చింది. ఆ ఘటన చాలా ఘోరమైనది. కాబట్టి చలపతి, విజయవర్ధనరావుల ఉరిశిక్షను యావజ్జీవిత ఖైదుగా మార్చమని మనం ప్రభుత్వానికి పెట్టిన డిమాండును సమాజంలో చాలామంది వ్యతిరేకించారు. ఉరిశిక్షకు సమాజంలో ఎంత మద్దతు ఉందో మనకు అర్థం అయింది. దానికి వ్యతిరేకంగా ప్రచార కార్యక్రమం చేపట్టి ఈ అభిప్రాయాన్ని పోగొట్టడానికి కృషి చేయడం అవసరం అని గుర్తించాము. లేకపోతే ఒక కేసులో ఏవైనా తాత్కాలిక కారణాలవల్ల విజయం లభించినా ఉరిశిక్షల పూర్తి రద్దు సాధ్యం కాదు. అందువల్ల రాష్ట్ర వ్యాపితంగా సభలు నిర్వహించి, ఇతరులు నిర్వహించిన సభలలో పాల్గొని మన డిమాండ్‌ను వివరించాము. ఉరిశిక్షను సూత్రప్రాయంగా ఎందుకు వ్యతిరేకిస్తున్నామో చెప్పి, అదే సమయంలో చలపతి, విజయవర్ధనరావు వంటి దళితులకు, ఇతరత్రా సమాజంలో బలం, పరపతి లేని వాళ్లకే ఉరిశిక్షలు పడే ప్రమాదం ఎక్కువ ఉందనే సామాజిక వాస్తవాన్ని కూడ వివరించి చెప్పాము.

చిలకలూరిపేట కేసులో ఉరిశిక్ష ఈ సంవత్సరం తప్పిపోయింది. ఈ విజయం సాధించడంలో మనతో కలిసి వచ్చిన దళిత ఉద్యమకారులకూ, ఢిల్లీకి చెందిన పియుడిఆర్ వంటి ప్రజాతంత్ర వాదులకూ సంస్థలకూ కూడ ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలుపుతున్నాం.

ఈ కేసులో మన కృషి ముగిసీ ముగియకముందే తమిళనాడులో 26 మందికి ఒకే కేసులో ఒకేసారి ఉరిశిక్ష వేసిన ఘటన జరిగింది. వీళ్లంతా శ్రీపెరంబుదూర్‌లో రాజీవ్ గాంధీనీ, అతని సహచరులనూ మానవబాంబు ప్రయోగంతో చంపిన కేసులో చెన్నై టాడా కోర్టు విచారించిన 'కుట్రదారులు'. ఆ కేసులో అసలు కుట్రదారులుగా పోలీసులు భావించిన ఎల్‌టిటిఇ అగ్రనాయకులు దొరకలేదు. ప్రత్యక్షంగా ఘటనలో పాల్గొన్న ధాను అప్పుడే చనిపోగా శుభ, శివరాసన్ తదితర ప్రత్యక్షపాత్రధారులు కేసు మొదలయ్యే లోపల ఎన్‌కౌంటర్లలో చనిపోవడమో ఆత్మహత్య చేసుకోవడమో జరిగింది. విచారణకు దొరికిన వారంతా ఘటనలో చిన్న పాత్రలు పోషించిన

వ్యక్తులే. వీరందరినీ కుట్రదారులుగా పోలీసులు (కార్తికేయన్ నాయకత్వంలోని ఎస్ఐటి) చూపించగా, టాడా స్పెషల్ కోర్టు అందరికీ ఉరిశిక్ష విధించింది. వీళ్లకు వ్యతిరేకంగా ఉన్న సాక్ష్యంలోని ప్రధాన అంశం వాళ్లే ఒక ఎస్‌పి ర్యాంకు పోలీస్ అధికారికి ఇచ్చిన ఒప్పుకోలు. అది టాడా కేసుకాబట్టి ఈ సాక్ష్యం కోర్టులో చెల్లుబాటయింది. దానిని ఆధారం చేసుకొని అందరికీ శిక్షలు వేయడమేకాక, ఆ సాక్ష్యం ప్రకారం కూడ కేవలం కుట్రదారులే అయిన వారికి కోర్టు ఉరిశిక్ష వేసింది. దీనికి వ్యతిరేకంగా తమిళనాడులోని పౌరహక్కుల సంఘాలూ (ప్రధానంగా పియుసిఎల్) ఇతర ప్రజాసంఘాలూ తమిళ జాతీయవాద సంస్థలూ ఆందోళన ప్రారంభించాయి. ఇతర రాష్ట్రాల ప్రజాతంత్ర వాదులు కూడ స్పందిస్తున్నారు. పాండిచ్చేరిలో తిరువనంతపురంలో జరిగిన రెండు సదస్సులలో మనం పాల్గొన్నాము. హైదరాబాద్‌లో కూడ సదస్సు నిర్వహించమని మనల్ని వారు కోరారుగానీ రాష్ట్ర మహాసభల వల్ల నిర్వహించలేకపోయాము.

10. 1996లో వరంగల్ జిల్లాలో జరిగిన రెండు ఘటనలు రాష్ట్రమంతటా సంచలనం సృష్టించాయి. మొదటిది ఆమెడ నారాయణ హత్య. నారాయణ పేదప్రజల డాక్టరు. కాయకష్టం చేసుకునే కుమ్మరి కులంలో పుట్టాడు. వరంగల్ పట్టణానికి సమీపంలో ఉన్న మొగిలిచర్లలో క్లినిక్ పెట్టుకున్నాడు. రోజూ హన్మకొండ నుండి పోయి వచ్చేవాడు. ప్రజలలో ముఖ్యంగా పేదప్రజలలో చాలా మంచి పేరున్న వైద్యుడు. అతను అజ్ఞాత నక్సలైట్లకు వైద్యం చేస్తున్నాడని పోలీసులతన్ని వేధించినా భయపడలేదు. మొగిలిచర్లలో ఉంటే నక్సలైట్లతో సంబంధాలు కొనసాగిస్తాడన్న అనుమానంతో అతని క్లినిక్ మూసేయించాలని పోలీసులు ప్రయత్నం చేస్తే క్లినిక్ మాత్రం మూసేయననీ కావాలంటే తన నివాసం హన్మకొండకు మార్చి రోజూ పోయి వస్తాననీ పట్టుబట్టి అట్లాగే చేయసాగాడు. చివరికి 1996 సెప్టెంబర్ 25నాడు పోలీసులు ఆమెడ నారాయణను మొగిలిచర్లకు పోయే దారిలో కాల్చి చంపారు. నారాయణహత్య విషయం తెలిసి అక్కడ పెద్ద సంఖ్యలో గుమిగూడిన ప్రజలను పోలీసులు కొట్టి తరిమేసారు.

ఘోరమైన ఈ ఘటనకు వరంగల్ జిల్లా కమిటీయేకాక రాష్ట్ర కమిటీ కూడ స్పందించింది. రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిజనిర్ధారణ కమిటి వేయడం, వరంగల్‌లో ప్రెస్‌కాన్ఫరెన్స్ పెట్టడం జరిగింది. డిసెంబర్ నెలలో ఉత్తర తెలంగాణలో పర్యటించిన అఖిలభారత పౌరహక్కుల నిజనిర్ధారణ కమిటీ పరిశీలన కోసం ఎంపిక చేసిన 10 ఘటనలలో నారాయణ హత్య కూడ ఒకటి. వరంగల్‌లోనూ హైదరాబాద్‌లోనూ మహబూబ్‌నగర్ జిల్లా అచ్చంపేటలోనూ నిరసన సభలు జరిపాము.

వరంగల్‌లో మన నిరసన సభ జరిగింది అక్టోబర్ 6న. అక్టోబర్ 7న వరంగల్ జిల్లా ములుగు సమీపంలో పీపుల్స్‌వార్ దళం మందుపాతర పేల్చి ఏడుగురు పోలీసులను చంపింది. ఆ వార్త వరంగల్ చేరగానే తెల్లబట్టల పోలీసులు రోడ్లలోకి వచ్చి స్వైరవిహారం చేసారు. బలవంతంగా పట్టణాన్ని బంద్ చేయించారు. ఇనపరాడ్లతోనూ, కర్రలతోనూ రోడ్లో కనిపించిన వాహనాలపైన దాడిచేసి అద్దాలు పగలగొట్టి జనాన్ని భయభ్రాంతుల్ని చేసారు. ఎన్నికల ఊరేగింపులో పోతున్న కాంగ్రెస్‌నాయకులను కొట్టారు. పౌరహక్కుల సంఘం వరంగల్ జిల్లాశాఖ బాధ్యులైన బుర్రా రాములు, అంబటి శ్రీనివాస్‌లను, రాష్ట్ర బాధ్యులను పేరు పెట్టి చంపుతాం అని హెచ్చరిస్తూ నినాదాలు ఇచ్చారు.

ఈ బీభత్సాన్ని కన్నబిరాన్‌గారు హైకోర్టు ప్రధానన్యాయమూర్తి దృష్టికి తీసుకురాగా, వారు బుర్రా రాములు, అంబటి శ్రీనివాస్‌లకు రక్షణ కల్పించవలసిందిగా వరంగల్‌జిల్లా ఎస్.పికి ఆదేశం ఇవ్వడమేకాక, అక్టోబర్ 7నాటి పోలీసుల బీభత్సకాండపైన విచారణ జరిపి హైకోర్టుకు నివేదిక ఇయ్యవలసిందిగా ఆ జిల్లా మానవ హక్కుల కోర్టుకు (మొదటి అదనపు జిల్లా జడ్జికోర్టుకు) ఆదేశం ఇచ్చారు. ఈ విచారణలో మనం మొదటినుండి చివరిదాకా పాల్గొన్నాము. వరంగల్‌లో ఈ విచారణ చాలా ఉత్సుకత కలిగించింది. ఆ జడ్జి చివరికి చాలా పక్షపాతంతో కూడిన రిపోర్టు హైకోర్టుకు సమర్పించాడు. ఆనాటి బీభత్సానికి పోలీసులు బాధ్యులని చెప్పలేమనీ, ఎవరైనా కావచ్చుననీ నిర్ధారించాడు. దీనిని వివరంగా విమర్శిస్తూ హైకోర్టుకు మనవాదనలు లిఖితపూర్వకంగా సమర్పించాము. హైకోర్టులో వాదనలు ఇంకా జరగవలసి ఉంది.

11. 1997 లో రాష్ట్ర కార్యవర్గం చొరవ తీసుకున్న మొదటి కార్యక్రమం ప్రాంతీయ అసమానతల గురించి. చాలా కాలం స్తబ్దంగా ఉన్న ప్రత్యేక తెలంగాణ డిమాండ్ ఈ మధ్యకాలంలో మళ్లీ బలంగా ముందు కొచ్చింది. తెలంగాణ సమస్యలు ఉమ్మడి రాష్ట్రంలో పరిష్కారంకాలేదనీ, కావనీ వాటికి పరిష్కారం కావాలంటే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడడం అవసరమనీ ప్రత్యేక తెలంగాణ ఉద్యమకారులు వాదించారు. ఒక రాజకీయ ఉద్యమం ముందుకొచ్చినప్పుడు దానితో ఏకీభవించడం లేక విభేదించడం కంటే అది లేవదీసిన ప్రజాతంత్ర సమస్యలను చర్చించడం ముఖ్యమన్న పౌరహక్కుల దృక్పథంతో మనం ఈ డిమాండుకు స్పందించాము. ఒక రాష్ట్రంలోని ప్రాంతీయ అసమానతల్ని తొలగించడానికి ఆ రాష్ట్ర ప్రభుత్వానికి ఒక విధానమంటూ లేకపోవడం, లేదా తన విధానాల ద్వారానే అసమానతలను పెంచడం, వివక్షతో కూడిన పాలనా పాలసీలు చేపట్టడం అప్రజాస్వామికం అనే అవగాహనను

ప్రచారం చేయడం మన కర్తవ్యమనీ అందులో భాగంగా మన రాష్ట్రంలో తెలంగాణ, రాయలసీమ ప్రాంతాలు ఎదుర్కొంటున్న వివక్షను చర్చకు పెట్టాలనీ భావించాము. ఎవరి సమస్యలు వారి తలనొప్పేనన్న వైఖరితో ఒకరి సమస్యలు మరొకరు అర్థం చేసుకోకుండ ఉండే పరిస్థితి పోవాలని భావించి రాష్ట్రంలోని మూడు ప్రాంతాలలోనూ ప్రాంతీయ వివక్షకు వ్యతిరేకంగా సదస్సులు నిర్వహించాము. వరంగల్‌లో మార్చి 9న, అనంతపురంలో ఏప్రిల్ 26న, విజయవాడలో ఆగస్ట్ 24న సదస్సులు జరిపాము. మన వైఖరిని వివరించే కరపత్రం ప్రచురించాము. మూడు సదస్సులలోనూ తెలంగాణ, రాయలసీమ ఉద్యమాలలో ప్రముఖపాత్ర నిర్వహిస్తున్న వారి చేత మాట్లాడించాము.

12. 1997 మార్చి 30న రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో కడప పట్టణంలో స్త్రీలపైన లైంగిక హింస అనే అంశం మీద సదస్సు నిర్వహించాము. పితృస్వామ్యాన్ని ఒక అణచివేత వ్యవస్థగా గుర్తించి స్త్రీలపైన అమలయ్యే అణచివేత నొక పౌరహక్కుల సమస్యగా మనం చేపట్టడం మొదలు పెట్టినప్పటి నుండి ప్రధానంగా వరకట్నం మరణాల గురించి, రేప్ గురించి ఆందోళన చేస్తున్నాం. ప్రతీ సంఘటన గురించి కాకున్నా కొన్నిటి గురించి నిజనిర్ధారణ చేస్తున్నాము. పోలీసులు కేసు పెట్టకపోతే ఒత్తిడి పెట్టి కేసు నమోదు చేయిస్తున్నాము. దాని కోసం ఆందోళన అవసరమైతే ఆందోళన చేపడుతున్నాం. అందువల్ల కార్యకర్తల అవగాహన పెంచుకోవడానికి ఉపయోగపడుతుందని లైంగిక హింసపైన సదస్సు నిర్వహించి లైంగిక నేరాలకు సంబంధించిన సామాజిక సాంస్కృతిక నేపథ్యం గురించి, చట్టాల గురించి, ఉద్యమకారుల అనుభవాల గురించి వక్తల చేత మాట్లాడించాము. ఇటువంటి సదస్సు ఒక్క కేంద్రంలో మాత్రమే జరిపితే అక్కడికి రాగల కార్యకర్తలు మాత్రమే ప్రయోజనం పొందుతారు.

ఈ సదస్సు సందర్భంగా రాష్ట్రంలో లైంగిక నేరాలు ఎంత విరివిగా జరుగుతున్నాయో చూపించడం కోసం అన్ని జిల్లా శాఖలూ రెండు నెలలలో ఆయా జిల్లాలలో లైంగిక హింసకు సంబంధించిన నేరాలు ఎన్ని జరిగాయో తెలియజేసే వివరాలు సేకరించి రాష్ట్ర కమిటీకి పంపించాలని అనుకున్నాం. అతి కొద్ది జిల్లాలు మాత్రమే ఆ పని పూర్తిచేయడంవల్ల సమగ్రమైన సమాచారం ఇవ్వలేకపోయాము.

ప్రస్తుత మహాసభల సందర్భంగా, లైంగిక హింసపైన ఒక ప్రచురణ తీసుకొచ్చే ఉద్దేశ్యంతో అన్ని జిల్లా శాఖలూ ఈ సంవత్సరం జనవరి నుండి జూన్‌దాకా జరిగిన రేప్ నేరాల సంఖ్య, చివరి రెండు నెలలలో జరిగిన ఘటనల పైన నిజనిర్ధారణ రిపోర్టులు పంపించాలని రాష్ట్ర కమిటీ సూచించింది. అయితే మళ్లీ అతి కొద్ది జిల్లాలు మాత్రమే ఈ సూచనను అమలు చేసిన కారణంగా ఆ ప్రచురణ తేలేకపోయాము.

నిజానికి, స్త్రీల సమస్యలు ఎక్కువగా చేపట్టలేకపోతున్నామనీ, చేపట్టినవి కూడ చివరిదాకా తీసుకుపోలేకపోతున్నామనీ చాలా జిల్లాల కార్యదర్శుల నివేదికలలో ఆత్మవిమర్శ చేసుకోవడం ఈ మహాసభల సందర్భంగానే కాక గతంలో కూడ జరిగింది. ఎప్పటికైనా సవరించుకుంటేనే ఆత్మవిమర్శకు అర్థం ఉంటుంది. లేకపోతే ఆసక్తి లేదనే అభిప్రాయానికి రావలసి ఉంటుంది.

13. మాదిగ దండోరా ఉద్యమానికి మన సహకారాన్ని గతరాష్ట్ర మహాసభల నాటికే ప్రకటించాము. కులపరమైన వివక్ష ఉన్న చోట దానిని అధిగమించడానికి విద్యా ఉద్యోగ రాజకీయ రంగాలలో రిజర్వేషన్లు ఇవ్వడం తప్పనిసరి. దానితోనే సమస్య మొత్తం పరిష్కారం కాదుగానీ రిజర్వేషన్లు అవసరం. ఎస్‌సిలలో కొన్ని కులాలు మిగిలిన కులాల కంటె వెనుకబడి ఉన్నప్పుడు ఎస్‌సిరిజర్వేషన్లను వర్గీకరించి విడివిడిగా కోటాలు కల్పించడం అదే తర్కం ప్రకారం న్యాయమైన చర్య. ఈ దృష్టితో మనం మాదిగ రిజర్వేషన్ ఉద్యమం పుట్టినప్పటి నుండి వారి డిమాండ్‌లో న్యాయముందని సమర్థిస్తున్నాం. వివిధ ప్రజాసంఘాలతో కలిసి ఐక్యకార్యాచరణకమిటీగా ఏర్పడి వర్గీకరణ డిమాండ్‌కు మద్దతుగా ప్రచారం చేపట్టాము. వర్గీకరణ డిమాండ్‌ను మొత్తంగా తిరస్కరిస్తున్న మాలమహానాడు వైఖరి సరయినది కాదని విమర్శించాము. అదే సమయంలో మాలకులస్థులే తమ ప్రధాన శత్రువులనే పద్ధతిలో మాదిగ దండోరా నాయకులు చేస్తున్న వ్యాఖ్యలు సరయినవి కావనీ దళిత కులాలు ఒకరికొకరు శత్రువులు ఎప్పటికీ కారనీ ఆ కులాల ఉమ్మడి శత్రువు కులవ్యవస్థ, అగ్ర కులాల ఆధిపత్యం అనీ విమర్శించాము. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వేదిక మీద నుండి కూడ ఈ వైఖరిని విమర్శించాము.

రాష్ట్ర ప్రభుత్వం ఎంఆర్‌పిఎస్ డిమాండ్‌ను అంగీకరించి ఎస్‌సి రిజర్వేషన్‌ను నాలుగుగా వర్గీకరించింది. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ మాల మహానాడు కోర్టుకు పోగా వర్గీకరణ కోరిన కులాలు కూడ న్యాయవాదులను పెట్టుకొని ప్రతివాదులుగా కేసులో చేరాయి. రెల్లిల తరఫున కన్నబిరాన్ గారు వాదించారు. ఎస్‌సి అనేది రాజ్యాంగం దృష్టిలో అట్టడుగు వర్గీకరణ కాబట్టి 'మరీ అడుగున ఉన్నవారు' అనే ఉపవర్గీకరణ చేయడానికి చట్టపరంగా ఆస్కారం లేదని ఒక వాదన, ఇటువంటి ఉపవర్గీకరణ ఏదైనా కేంద్రం (రాష్ట్రపతి) చేయాలి తప్ప రాష్ట్ర ప్రభుత్వాలు చేయకూడదనీ, కొన్ని కులాలు మరీ వెనుకబడి ఉన్నాయని నిర్ధారించడానికి కావలసిన సమగ్రమైన సమాచారం రాష్ట్ర ప్రభుత్వం సేకరించలేదనీ, జనాభా దామాషాను అంచనా వేయడానికి 1981 జనాభా లెక్కల పైన

ఆధారపడడం వల్ల వర్గీకరణ చెల్లదనీ, ఆర్టికల్ 338 ప్రకారం ఎస్‌సిల స్థితిగతులకు సంబంధించి ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకోదలచినా ముందు జాతీయ ఎస్‌సి ఎస్‌టి కమిషన్‌ను సంప్రదించాలని మరికొన్ని వాదనలు పిటిషనర్‌లు కోర్టు ముందు ఉంచారు. వీటిలో ఆఖరు వాదన మాత్రమే సబబయినది. ఎస్‌సి ఎస్‌టి కమిషన్‌ను సంప్రదించకుండ రాష్ట్ర ప్రభుత్వం వర్గీకరణ చేయడం తప్పు. అయితే ఈ విషయం మనం కూడ సకాలంలో గుర్తించి ప్రభుత్వానికి చెప్పలేక పోయాము కాబట్టి దీనికి ప్రభుత్వాన్ని మాత్రమే తప్పుపట్టలేము.

హైకోర్టు వర్గీకరణ జివోను కొట్టేయగా రాష్ట్ర ప్రభుత్వం జాతీయ ఎస్‌సిఎస్‌టి కమిషన్‌కు సమస్యను నివేదించింది. జాతీయ కమిషన్ మరికొంత సమాచారం కావాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరగా, ప్రభుత్వం వెంటనే పంపించకుండ జాప్యం చేస్తున్నదని ఎంఆర్‌పిఎస్ ఆందోళన చేసినప్పుడు అది న్యాయమైన ఆందోళనే అని సమర్థించాము. చాలామంది ఊహించినట్టే జాతీయ ఎస్‌సి ఎస్‌టి కమిషన్ వర్గీకరణ చేయడం తప్పని అభిప్రాయపడింది. అయితే కమిషన్ అభిప్రాయం ప్రభుత్వానికి శిరోధార్యం కాదని రాజ్యాంగం స్పష్టంచేస్తుంది. ప్రభుత్వం కమిషన్‌తో విభేదించే నిర్ణయం తీసుకోదలచుకుంటే దానికి కారణం అసెంబ్లీకి వివరించవలసి ఉంటుందని ఆర్టికల్ 338 (5) అంటుందే తప్ప విభేదించే నిర్ణయం తీసుకోవడానికి వీలు లేదనదు. ముందు అసెంబ్లీకి వివరించిన తరువాత జివో జారీ చేయాలా లేక జివో జారీ చేసిన తరువాత అసెంబ్లీకి వివరించవచ్చునా అన్న ధర్మ సందేహంతో ప్రభుత్వం ప్రస్తుతం సతమతం అవుతున్నట్టుంది. అనుమాన నివృత్తికోసం అసెంబ్లీని ఒక రోజయినా సమావేశపరిచి కారణాన్ని వివరించి వర్గీకరణ జివో వెంటనే జారీ చేయాలని మనం ప్రభుత్వాన్ని డిమాండ్ చేయాలి.

దండోరా ఉద్యమం అందరికీ ఒక విలువయిన గుణపాఠం నేర్పింది. ప్రజల మధ్య సమస్యలు సామాజికంగా పరిష్కారం కాకుండ కేవలం చట్టరూపంలో పరిష్కారమయితే ఆ పరిష్కారం చిక్కులలో పడుతుంది. ఒక పరిష్కారమంటూ జరిగిన తరువాత స్థిరత్వం కోసం దానికి చట్టరూపం ఇయ్యడం సబబే. కానీ చట్టం చేసేస్తే పరిష్కారం అయిపోతుందనుకోవడం పొరబాటు. అట్లాగని చట్టం కోసం అడగకుండ ఉండడం వివక్షకు గురయ్యేవాళ్లకు సాధ్యం కాదు. అయితే దానితోపాటు సామాజిక పరిష్కారం కోసం కూడ ప్రయత్నం చేయడం అవసరం. మాల మాదిగ రిజర్వేషన్ వర్గీకరణ సమస్యను సామాజికంగా ఎవ్వరూ పరిష్కారం చేయకపోవడం ప్రస్తుత పరిస్థితికి దారి తీసింది. ఇది ప్రధానంగా ఎవరి వైఫల్యం అన్న చర్చలోకి పోకుండ మనం సహితం ఈ ప్రయత్నం చేయలేదని ఆత్మవిమర్శ చేసుకోవడం ఉచితంగా ఉంటుంది.

దీని ఫలితం హైకోర్టు తీర్పు వెలువడిన తరువాత తూర్పు పశ్చిమ గోదావరి జిల్లాలలో జరిగిన మాల - మాదిగ ఘర్షణలో కనిపించింది. మనం ఆ ఘర్షణలకు వెంటనే స్పందించి ఆ గ్రామాలు తిరిగి ఘర్షణల గురించి నిజనిర్ధారణ చేయడమేకాక, దళితులకు మొత్తంగా నష్టకరమైన ఘర్షణ వాతావరణాన్ని పెంపొందించవద్దని ఆ గ్రామాల దళిత యువకులతో మాట్లాడాము.

ఆ తరువాత, మాదిగ రిజర్వేషన్ వర్గీకరణ డిమాండ్‌ను సూత్రప్రాయంగా సమర్థిస్తూ మాల మాదిగల ఐక్యత కోసం కృషి చేయాలని పిలుపునిస్తూ కరపత్రం ప్రచురించి రాష్ట్ర వ్యాప్తంగా పంచాము. ఆ కరపత్రంలో రెండు వైపులా ఉద్యమకారులు చేస్తున్న తప్పుడు వ్యాఖ్యలనూ వారి తప్పుడు అవగాహననూ విమర్శించాము.

అయితే పౌరహక్కుల అవగాహన గురించి సంస్థలో జరిగిన చర్చలో ఉద్యమాలను విమర్శించడం మన కర్తవ్యం కాదన్న అభిప్రాయం మెజారిటీ అభిప్రాయంగా వ్యక్తమయింది. ఇకమీదట ఇటువంటి సమస్యలు ముందుకొస్తే ఏవిధంగా వ్యవహరించాలో సంస్థ నిర్ణయించుకోవలసి ఉంది. మహాసభ ఈ విషయాన్ని చర్చించి తగు సూచనలిస్తుందని ఆశిస్తాం.

14. పీడిత ప్రజాశ్రేణుల మధ్య సమస్యగా మారి చట్టం చేయడం సాధ్యం కాకుండ పోయిన మరొక సమస్య మహిళల రాజకీయ రిజర్వేషన్ సమస్య. అసెంబ్లీలో పార్లమెంటులో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లు గతంలో యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం, ఈ మధ్య బిజెపి ప్రభుత్వం ప్రవేశ పెట్టడానికి ప్రయత్నం చేసినప్పుడు అందులో బిసి మహిళలకు కోటా ఇవ్వాలనీ అది జరిగేంత వరకు ఆ బిల్లు ప్రవేశ పెట్టడానికి వీలు లేదనీ ఒక వాదన వచ్చింది. బిసికోటా ఇవ్వడం పట్ల అభ్యంతరమేమీ లేదు గానీ అందులో సాంకేతిక సమస్యలున్నప్పుడు అది జరిగేంతవరకు మహిళా రిజర్వేషన్ల బిల్లు ఎందుకు ఆగాలని బిల్లును సమర్థించేవాళ్లు వాదించారు.

కులం, పితృస్వామ్యం రెండూ అణచివేత వ్యవస్థలేకాక రెండూ కూడ అటు ఎస్‌సి బిసి కులాలకూ ఇటు స్త్రీలకూ సమాజ విధాన నిర్ణయాలలో పాల్గొనే రాజకీయ స్వేచ్ఛ లేకుండ చేసాయి కాబట్టి అసెంబ్లీ పార్లమెంట్‌లలో రిజర్వేషన్ పొందడం ఒక ప్రజాస్వామిక హక్కని గుర్తించి ఈ చర్చలో పౌరహక్కుల ఉద్యమం కూడ పాల్గొనాలని భావించాము. గుంటూరులో ఈ విషయం మీద సదస్సు నిర్వహించాము.

అయితే ఈ సదస్సు గురించి తరువాత చర్చ జరిగినప్పుడు అసెంబ్లీలోనూ పార్లమెంటులోనూ ప్రాతినిధ్యం పొందడం అంటే రాజ్యంలో (అంటే ఒక ప్రధానమైన అణచివేత యంత్రాంగంలో) భాగం కావడం అనే దృక్పధాన్ని కూడ చర్చలో చేర్చవలసి ఉండిందని చాలా మంది అన్నారు. ఇప్పటివరకు మహిళా రిజర్వేషన్ బిల్లును స్త్రీలకు రాజకీయ హక్కులు కల్పించే విషయంగానే చూసాము. అయితే గుంటూరులో నిర్ణయమయిన మెజారిటీ అవగాహన వెలుగులో దానిని ఏ విధంగా చూడాలో సంస్థ నిర్ణయించుకోవలసి ఉంది.

15. మరొక ముఖ్యమైన పౌరహక్కుల సమస్యపైన కూడ 1991లో మనం రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన జరిపి, హైదరాబాద్‌లో సెమినార్ నిర్వహించాము. ఇది, సైన్యంలేక పోలీసు యంత్రాంగం ప్రోద్బలంతో పని చేసే ప్రైవేట్ హంతక ముఠాల సమస్య. మామూలుగా కూడ పోలీసు శాఖకు కొందరు నేరస్తులతో సంబంధాలుంటాయి. వారిని పోలీసులు చట్టవ్యతిరేకమైన పనులకు వాడుకుంటుంటారు. అయితే ఈ 'కౌంటర్ - ఇన్సర్జెంట్స్' సమస్య రాజకీయ ఉద్యమాలకు వ్యతిరేకంగా ప్రభుత్వాలు ఒక విధానంగా ముందుకు తెస్తున్న ఎత్తుగడకు సంబంధించినది. మిలిటెంట్ రాజకీయ ఉద్యమాలలో పని చేసి బయటికొచ్చి నేరస్తులుగా మారిపోయిన వారిని పోలీసులు, లేక సైన్యం చేరదీసి వాళ్ల చేత వాళ్ల మాజీ సహచరులపైన, ఉద్యమాలపైన దాడి చేయించడం, చంపించడం, ఇళ్లు కాలబెట్టించడం జరుగుతున్నది. మొదట ఈశాన్య భారత దేశంలోనూ తరువాత పంజాబు, కాశ్మీర్‌లలోనూ రూపుదిద్దుకున్న ఈ హంతక విధానం ఈ మధ్యకాలంలో మన రాష్ట్రంలో కూడ బీజరూపంలో మొదలయింది. 1995-96 కాలంలోనే మెదక్ జిల్లాలో అప్పుడు ఎస్‌పిగా ఉన్న వినయ్‌కుమార్ సింగ్ సిపిఐ (ఎం.ఎల్) ప్రజారక్షణ అనే 'పార్టీని' స్థాపించాడు. ఇందులో ఉన్నవారందరూ గతంలో పీపుల్స్ వార్‌లో పని చేసి బయటికి పోయి నేరస్తులుగా మారి పోలీసుల పంచన చేరినవారే. వీళ్ల చేత పోలీసులు దాడులు చేయించేవారు. వీళ్లు ఆయుధాలు పట్టుకొని పోలీసులతో కలిసి తిరిగేవారు.

చట్టాన్నీ చట్టబద్ధ పాలననూ అపహాస్యం చేసే ఈ వికృత సృష్టి మీద మెదక్ జిల్లాలో పత్రికా విలేకరులు మొదట ఆందోళన వ్యక్తం చేసారు. మనము కూడ రెండు రోజులు పర్యటించి సవివరమైన ప్రకటన ఇవ్వడం జరిగింది.

కొంతకాలానికి ఈ 'ప్రజారక్షణ' కనుమరుగయ్యే పరిస్థితి వచ్చింది. అయితే అంతలో గ్రీన్ టైగర్స్, సిపిఐ (ఎంఎల్) క్రాంతిసేన, బ్లాక్ టైగర్స్ అనే పేర్లతో గుర్తు తెలియని వ్యక్తులు దాడులు చేయడం మొదలుపెట్టారు.

1997 ఏప్రిల్ 6వ తేదీన ప్రజాగాయకుడు గద్దర్‌పైన ఆయన ఇంట్లోనే హత్యాప్రయత్నం జరిగింది. హత్యాప్రయత్నం చేసినవారు తమనుతాము 'గ్రీన్‌టైగర్స్'గా ప్రకటించుకున్నారు. వాళ్లు పోలీసులయినా అయి ఉండాలి. లేదా పోలీసుల మద్దతు ఉన్న నేరస్తులయినా అయి ఉండాలి అని నమ్మడానికి రాష్ట్రంలో ఎవరూ వెనకాడలేదు. గద్దర్‌పైన హత్యా ప్రయత్నానికి నిరసనగా మొట్టమొదట మనమే హైదరాబాద్‌లో బహిరంగ సభ నిర్వహించాము. ఆ తరువాత రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన ఆందోళనలో పాలుపంచుకున్నాము. వివిధ ప్రజా సంఘాలు కలిసి ఏర్పాటు చేసిన ఐక్య కార్యాచరణ వేదికలో మనం కూడ భాగస్వాములయ్యాము. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించినట్టు చేసి ఒక సీనియర్ ఐపిఎస్ అధికారి నేతృత్వంలో స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం నెలకొల్పింది గానీ త్వరలోనే దానిని రద్దు చేసి స్థానిక పోలీసులకే ఇన్వెస్టిగేషన్ అప్పగించారు. ఇప్పటిదాకా ఎవరినీ అరెస్టు చేయలేదు.

ఆ తరువాత గ్రీన్‌టైగర్స్ పేరు మీద ఎపిసిఎల్‌సి బాధ్యులందరినీ చంపుతామని ప్రకటనలు వచ్చాయి. వీటిని పత్రికలలో చదివి తమిళనాడు రాష్ట్ర పియుసిఎల్ ప్రధాన కార్యదర్శి సుధారామలింగంగారు మనరాష్ట్ర హైకోర్టుకు రాసిన ఉత్తరం రిట్‌పిటిషన్‌గా స్వీకరించబడింది. ఇదంతా నడుస్తుండగా బ్లాక్ టైగర్స్ పేరు మీద నల్గొండ జిల్లా భువనగిరి ఆలేరు ప్రాంతాలలో బెదిరింపు పోస్టర్లు పడ్డాయి. క్రాంతిసేన పేరు మీద బెదిరింపు ప్రకటనలు వెలువడడమేకాక మే 30, జూన్ 1 తేదీలలో వరంగల్, కరీంనగర్ జిల్లాలలో ఇద్దరు రాడికల్ యువకులను క్రాంతిసేనగా చెప్పుకున్నవారు చంపడం కూడ జరిగింది. ఈ సంస్థలన్నీ తమ ప్రకటనలలో నక్సలైట్ పార్టీలనూ, వాటికి సహాయ సహకారాలు అందిస్తున్నట్టు చెప్పబడే ప్రజాప్రతినిధులనే కాక పౌరహక్కుల సంఘం బాధ్యులను కూడ పేర్కొని 'చంపుతాం' అని హెచ్చరించాయి.

1997 మే 27న మహబూబ్‌నగర్ పట్టణంలో మన రాష్ట్ర సహాయకార్యదర్శి పురుషోత్తంపైన హత్యా ప్రయత్నం జరిగింది. చీకటిలో వెనుక నుండి అతని తల మీద కొడవలి వంటి ఇనుప పరికరంతో బలంగా కొట్టి తీవ్రంగా గాయపరిచారు. ఈ హత్యా ప్రయత్నం చేసిన వారు తమను తాము గ్రీన్ టైగర్స్‌గా చెప్పుకుంటూ పత్రికా ప్రకటన ఇచ్చారు. మహబూబ్‌నగర్ జిల్లాలోనే మరి కొందరిని (కరువు వ్యతిరేక కమిటీ బాధ్యులను, ఒక ఎన్‌కౌంటర్ విషయంలో కోర్టులో సాక్ష్యం ఇవ్వడానికి పోతున్న అమ్రాబాద్ మండలాధ్యక్షుడిని) ఈ గ్రీన్ టైగర్స్ బెదిరించారు.

పురుషోత్తంపైన జరిగిన హత్యా ప్రయత్నానికి వ్యతిరేకంగా మనం రాష్ట్రంలోని అన్ని జిల్లాలలోనూ బహిరంగ సభలు నిర్వహించాము. ఆ సందర్భంగా గ్రీన్ టైగర్స్, క్రాంతిసేన మొదలయిన పేర్లతో పోలీసులు చేస్తున్న, లేక చేయిస్తున్న దాడులను వివరంగా ఎండగట్టాము. 'మీ రంగురంగుల పులుల పాలనలో ప్రజలకు భద్రత ఎంతుంది ముఖ్యమంత్రిగారూ, అనే శీర్షికతో కరపత్రం అచ్చువేసి రాష్ట్ర వ్యాపితంగా పంచాము. నవంబర్ 9న హైదరాబాద్‌లో కౌంటర్ ఇన్సర్జెంట్‌ల సమస్య గురించి సెమినార్ నిర్వహించాము. కాశ్మీర్, పంజాబ్, అస్సాంలలో ఈ కిరాయి హంతక మూకలను ప్రభుత్వాలు ఏ విధంగా ప్రయోగించినదీ ఆ రాష్ట్రాల పరిస్థితులు బాగా తెలిసిన వక్తలు వివరించారు.

గ్రీన్ టైగర్స్, క్రాంతిసేన మొదలయిన పేర్లు గల కిరాయి నేరస్తుల సంస్థలు నిజంగా ఉన్నాయో లేక ఇవి కేవలం పోలీసులు తమ హంతక చర్యల కోసం వాడుకుంటున్న పేర్లో ఇప్పటికీ మనకు స్పష్టంగా తెలీదుగానీ ఒక విషయం మాత్రం ఇప్పుడు ఖచ్చితంగా చెప్పగలము. మన రాష్ట్ర పోలీసు యంత్రాంగం కొంతమంది వ్యక్తులను చేరదీసి వాళ్ళచేత తన నిర్బంధకాండను అమలు చేయించడం మొదలుపెట్టింది. ఈ వ్యక్తులు ఎక్కువ భాగం పీపుల్స్‌వార్‌లో పని చేసి బయటకు పోయి పోలీస్ ఏజెంట్లుగానూ, నేరస్తులుగానూ మారినవారు. ఇతర వృత్తి నేరస్తులు కూడ వారితో బాటు ఉండవచ్చును. పీపుల్స్‌వార్ దళాలలో పని చేస్తూ ఆ దళ సభ్యులను, లేక పార్టీనాయకులను చంపేసి పోలీసుల పంచన చేరిన సోమ్లా నాయక్, జడల నాగరాజులు ఈ విషయాన్ని ధృవీకరించారు. అయితే నిజామాబాద్ జిల్లాలో ఈ సంవత్సరం జరిగిన కొన్ని ఎన్‌కౌంటర్లలో కూడ హతుడిని కస్టడీలోకి తీసుకున్న వ్యక్తులు పోలీసులు కాదనీ పోలీసుల పురమాయింపులో పనిచేస్తున్న 'మాజీలు' అనీ స్థానిక ప్రజలు అంటున్నారు.

ఇది చాలా ప్రమాదకరమైన పోకడ. హత్య చేసి పోలీసుల వద్దకు వచ్చి చేరిన సోమ్లా నాయక్‌నూ జడల నాగరాజునూ అరెస్టు చేసి జైలులో పెట్టే బదులు హోంమంత్రి, డిజిపి వారిని పక్కన నిలబెట్టుకొని ప్రెస్‌కాన్ఫరెన్స్ పెట్టి హత్యలు చేసినందుకు వారిని అభినందిస్తూ లక్షల రూపాయల పారితోషికం ఇవ్వడాన్ని ప్రశ్నిస్తూ మనం హైకోర్టులో రిట్ పిటిషన్ వేసాము. అయితే ఈ కిరాయి హంతక విధానానికి వ్యతిరేకంగా ప్రజాభిప్రాయం కూడగట్టే పని కూడ మనం చేయాలి. ఇప్పటికి కొంత చేసి ఉన్నాము కానీ ఇంకా చాలా చేయాలి.

ఈ కిరాయి హంతక విధానాన్ని కేవలం నక్సలైట్ ఉద్యమం మీద లేదా ప్రజా ఉద్యమాల మీద అమలవుతున్న ఒక నిర్బంధ విధానంగా కాక, ప్రజాస్వామ్యం మూల సూత్రాలలో ఒకటయిన చట్టబద్ధ పాలన పైన దాడిగా కూడ చూడాలనీ ఆ విధంగా చూసినప్పుడే ఈ దాడికి గురవుతున్న ఉద్యమాల సానుభూతిపరులను మాత్రమేకాక వాటితో రాజకీయంగా విభేదించే వాళ్లను కూడ ప్రజాతంత్ర చైతన్యం ప్రాతిపదిక మీద ఆకర్షించగలుగుతామనీ భావించి ఆ దృష్టితోనే ఎక్కువగా ఇప్పటిదాకా ఈ విషయంలో ప్రచారం చేపట్టాము. అవగాహన చర్చలో వ్యక్తమయిన మెజారటీ అభిప్రాయం వెలుగులో ఈ ప్రచారాన్ని ఇకమీదట ఏ దృష్టితో నిర్వహించాలో సంస్థ నిర్ణయించుకోవాలి.

16. రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు చేపట్టిన మరొక కార్యక్రమం, డికె బసు కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును కరపత్రంగా అచ్చు వేసి రాష్ట్ర వ్యాప్తంగా పంచడం. ఆ కేసులో సుప్రీంకోర్టు పోలీసులు అరెస్టు చేసినప్పుడు; ఇంటరాగేషన్ చేసేటప్పుడు పాటించవలసిన నియమావళిని ప్రకటించింది. దానిని పాటించకపోవడం కోర్టు ధిక్కార నేరం కిందికి వస్తుందని చెప్పింది. కోర్టు ఆదేశం మేరకు రాష్ట్ర ప్రభుత్వాలు ఆ తీర్పును రేడియోలో టివిలో ప్రచారం చేస్తున్నాయి. పౌర సంబంధాల శాఖద్వారా కరపత్రం రూపంలో ప్రచారం కూడ చేస్తున్నాయి. కానీ పోలీసులు మాత్రం దానిని అమలు చేయడం లేదు. ప్రజలు ఆ తీర్పును తెలుసుకొని పోలీసులను నిలదీసి అమలు చేయించుకోవాలనే ఉద్దేశ్యంతో మనం ఆ తీర్పులో సుప్రీంకోర్టు నిర్దేశించిన నియమావళిని కరపత్రంగా అచ్చు వేసి విస్తృతంగా పంచాము.

17. 1997-98 సంవత్సరంలో తెలంగాణ జిల్లాలలో ముఖ్యంగా వరంగల్‌లో, 300కు పైగా జరిగిన పత్తి రైతుల ఆత్మహత్యలకు మనం వెంటనే స్పందించాము. వరంగల్, మెదక్, నల్గొండ, మహబూబ్‌నగర్‌జిల్లా శాఖలు నిజనిర్ధారణ కమిటీలు వేసి ఈ ఆత్మహత్యలకు గల కారణాలను అన్వేషించే ప్రయత్నం చేశాయి. స్థూలంగా చెప్పాలంటే,వ్యవసాయ ఆధునీకరణను ఒక విధానంగా అనుసరిస్తున్న ప్రభుత్వం అందులో రైతులు (ముఖ్యంగా పెట్టుబడులు లేని చిన్న రైతులు) ఎదుర్కొనే సమస్యలకు తాను బాధ్యత తీసుకోకపోవడం ఈ ఆత్మహత్యల వెనక ఉన్న ఒక ముఖ్య కారణం. ఆధునీకరణ జరగాలంటే రైతులకు పెట్టుబడి కావాలి, సాగునీరు కావాలి, పండినపంటకు గిట్టుబాటుధర కావాలి, ఎరువులు, మందుల నాణ్యతకు భరోసా కావాలి. వీటిలో ఏ ఒక్క దాని బాధ్యతా ప్రభుత్వం తీసుకోదు. తెలంగాణలో సాగునీటి లభ్యత చాలా తక్కువ. దానిని పెంచడానికి ప్రభుత్వం ఏమీ చేయదు. ఉన్న నీటి

వనరులను కాపాడదు, కొత్తవి కల్పించదు. రైతులే ఖర్చుపెట్టుకొని బావులు తవ్వుకోవాలి. పెట్టుబడులు గ్రామీణబ్యాంకుల ద్వారా సరఫరా చేస్తానని చెప్పుకున్న ప్రభుత్వం, ఆర్థిక పునర్వ్యవస్థీకరణలో భాగంగా గ్రామీణ బ్యాంకుల పెట్టుబడులు తగ్గించింది. వాటి వ్యాపార స్వభావాన్ని పెంచింది. ఇప్పుడవి రైతుల అవసరాలలో నాల్గవవంతు కూడ తీర్చడంలేదు. రైతులు అధిక వడ్డీకి బయట అప్పులు తెచ్చుకోవలసి వస్తున్నది. లేదా కొనుగోలు కమిషన్ ఏజెంట్లదగ్గర తమను తాము తాకట్టు పెట్టుకోవలసి వస్తున్నది. ఇక గిట్టుబాటు ధరలు ఇప్పించడం గానీ కల్తీని నివారించడంగానీ ప్రభుత్వం తన బాధ్యతగానే అనుకోదు. ఈ ప్రభుత్వ బాధ్యతారాహిత్యమే ఆత్మహత్యల ప్రధాన కారణం అని మనం విశ్లేషించాము. రాజ్యాంగ ఆదేశిక సూత్రాలకు ఇది పూర్తిగా విరుద్ధమైనది.

18. ఈ మహాసభలకు మనం తయారవుతుండగా, చంద్రబాబు ప్రభుత్వం ఒక కొత్త చట్టాన్ని తీసుకొచ్చే ప్రయత్నం మొదలు పెట్టింది. ఈ చట్టం ముసాయిదా చూస్తే ఇది పోలీసుల మెదళ్లలో పుట్టిందని అర్థం అవుతుంది. ఇందులో ఏక సమయంలో టాడా ఉంది, నాసా ఉంది, కల్లోలిత ప్రాంతాల చట్టం ఉంది. అయితే టాడాలోని టెర్రరిస్టు నేరాలకంటె ఈ చట్టం నిర్వచించే నేరం మరింత 'విశాలమైనది'. అయితే ఇదే కాక మరి రెండు అభ్యంతరకరమైన అంశాలు కూడ ఈ ప్రతిపాదిత చట్టంలో ఉన్నాయి. ఒకటి, సాంస్కృతిక రాజకీయ కార్యకలాపాలన్నిటిపైన నిషేధం పెట్టే అధికారం ప్రభుత్వం (జిల్లా కలెక్టర్) చేతిలో పెట్టడం. రెండు, ప్రభుత్వం తన హిట్‌లిస్టును 'ప్రకటిత వ్యక్తుల' జాబితాపేరుతో తయారుచేసుకునే అవకాశం ఇవ్వడం. ఈ ప్రకటిత వ్యక్తులు జీవించే హక్కుతో సహా అన్ని హక్కులూ కోల్పోతారు. వాళ్లను అరెస్టు చేసే క్రమంలో (వారి దగ్గర ఆయుధమున్నా లేకపోయినా) పోలీసులు నేరుగా కాల్పులు జరపవచ్చునని ఈ చట్టం అంటుంది. వీళ్లు ఎక్కడికి పోయినా పోలీసులకు చెప్పిపోవాలి. వీళ్ళను కొన్ని ప్రాంతాలలోకి రాకుండా నిషేధించవచ్చు. ఒక్కమాటలో చెప్పాలంటే ఈ ప్రకటిత వ్యక్తి చట్టానికి వెలుపల ఉండే 'ఔట్-లా'. అతనితో పోలీసులు చట్టంతో ప్రమేయం లేకుండ వ్యవహరించవచ్చు. ఇప్పటికే పోలీసులకు ఉద్యమకారులతో, ముఖ్యంగా నక్సలైట్లతో, చట్టాన్ని పక్కనపెట్టి వ్యవహరించడం ఒక అలవాటు అయిపోయింది. దానికి ప్రభుత్వ ఆమోదం ఉంది.ఇప్పుడు చట్టం ఆమోదం కూడ పొందడానికి వాళ్లను చట్టానికి వెలుపల పెట్టే చట్టం కావాలి. ఇంక 'ఎన్‌కౌంటర్ల' కు కట్టుకథలు కూడ చెప్పనక్కరలేదు. చట్టం ప్రకారమే కాల్చేశామని చెప్పవచ్చు. ఇటువంటి చట్టమింకా రాకముందే ఈ సంవత్సరం ఇప్పటికి 177 మందిని ఎన్‌కౌంటర్ల పేరిట చంపారు. ఇటువంటి చట్టం వస్తే ఇంకెంత మందిని చంపుతారో.

ఇటువంటి 'ఔట్-లా' ను సృష్టించే చట్టం రాజ్యాంగానికి వ్యతిరేకం అవుతుంది. ఎందుకంటే చట్టం అందరినీ సమానంగా కాపాడాలనేది భారత రాజ్యాంగంలో ఒక ప్రాథమిక హక్కు. అయినప్పటికీ ఇటువంటి చట్టాన్ని చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తున్నదంటే చట్టబద్ధపాలన ఎక్కడికి దిగజారిందో అర్థం అవుతుంది.

తాత్కాలికంగా నిలిచిపోయిన ఈ చట్టాన్ని విమర్శిస్తూ మనం విలేఖరుల సమావేశం నిర్వహించి మన అభ్యంతరాలు ప్రకటించాము. విలేఖరుల సమావేశంలో విడుదల చేసిన ప్రకటనను మన జంట నగరాలశాఖ తెలుగులోనూ ఇంగ్లీషులోనూ 5,000 కరపత్రాలు అచ్చువేసి పంచింది. బయటి రాష్ట్రాల పౌరహక్కుల సంఘాలకు దీని వివరాలు రాశాము. బహిరంగ సభలలో ఈ చట్టానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నాం.

ఈ చట్టాన్ని నక్సలైట్ల హింసను ఎదుర్కొనే పేరిట ప్రభుత్వం ప్రతిపాదిస్తున్నదిగానీ, జాగ్రత్తగా చదివితే ఈ చట్టం గురిపెట్టేది నక్సలైట్ ఉద్యమానికి 'మద్దతు, సహాయం, సహకారం, ప్రోత్సాహం' వగైరా ఇచ్చేవారిమీద. ఇవి చాలా అస్పష్టమైన మాటలు కాబట్టి వీటికింద నక్సలైట్లతో ఏమీ సంబంధంలేని వారిపైన కూడ చర్య తీసుకునే అవకాశం కలుగుతుందనేది ఒక అభ్యంతరం కాగా, నక్సలైట్‌ల హింసను మాత్రమే కాక ఆ ఉద్యమానికి ఉండే సామాజిక రాజకీయ పార్శ్వాన్ని కూడ ఈ చట్టంద్వారా నేరస్మృతి పరిధిలోకి లాక్కొచ్చే ప్రయత్నం చేస్తున్నారనేది రెండవ అభ్యంతరం. ఆ ఉద్యమాన్ని కేవలం శాంతి భద్రతల సమస్యగా చూసే వైఖరికి ఇది పరాకాష్ఠ.

ఈ చట్టాన్ని ఎదుర్కొనడానికి ఒక పెద్ద ఐక్య కార్యాచరణ వేదిక నిర్మించే ప్రయత్నం కొన్ని రాజకీయ సంస్థలు మొదలుపెట్టాయి. తెలంగాణలో అమలయ్యే నిర్బంధానికి వ్యతిరేకంగా ఆందోళన చేసేటప్పుడు ఎం.ఎల్ పార్టీలతోనూ వాటి ప్రజా సంఘాలతోనూ కలిసి ఐక్య కార్యాచరణ చేపట్టడం పౌరహక్కుల ఉద్యమానికి మంచిది కాదన్న అభిప్రాయంతో ఆ ప్రయత్నానికి దూరం ఉన్నాముగానీ ఐక్య సంఘటనలు కలిసొచ్చే వారెవరితోనయినా కట్టవచ్చునన్న అభిప్రాయం గుంటూరు సర్వసభ్య సమావేశం వ్యక్తం చేసింది కాబట్టి నూతన కార్యవర్గం ఈ ప్రయత్నాలలో భాగం కావచ్చు.

19. 1996లో రాష్ట్రంలో కురిసిన అకాల వర్షాల నేపథ్యంలో ప్రకాశం, నెల్లూరు, కడప, చిత్తూరు జిల్లాలలో చెరువుల కట్టలు వందల సంఖ్యలో తెగి చాలా ఊర్లు కొట్టుకుపోయాయి, ఇళ్లు కూలిపోయాయి, మూడు వందల మంది దాకా చనిపోయారు, వేలమంది

నిరాశ్రయులయ్యారు. దీనిపై మనం వివరంగా నిజనిర్ధారణ జరిపాము. ఇది కేవలం ప్రకృతి బీభత్సం కాదనీ చెరువుల నిర్వహణ పట్ల, భూసార సంరక్షణపట్ల ప్రభుత్వం ప్రదర్శిస్తున్న విపరీతమైన నిర్లక్ష్యం దీనికి కారణమనీ వివరిస్తూ పత్రికా ప్రకటనలు ఇచ్చాము, స్వేచ్ఛలో వ్యాసం రాసాము. చెరువుల నిర్వహణలో వైఫల్యం వరదలకెట్లా దారి తీస్తుందో వివరిస్తూ ఒంగోలులో నిర్వహించాలనుకున్న సదస్సు మాత్రం నిర్వహించలేకపోయాం.

రాష్ట్ర కమిటీ నిర్ణయం తీసుకొని అమలు చేయకుండ పోయిన కార్యక్రమాల గురించి కూడ చెప్పుకోవాలి.

(1) సంస్థలోని న్యాయవాదులలో న్యాయవ్యవస్థలో పౌరహక్కుల ఉద్యమకారుల పాత్ర గురించి అవగాహన పెంచడానికి ఇప్పటికి రెండుసార్లు వర్క్‌షాప్‌లు నిర్వహించడం జరిగింది. రెండవ వర్క్‌షాప్ 1996 మే నెలలో గుంటూరు జిల్లాలో జరిగింది. ఈ వర్క్‌షాప్‌లు సంతృప్తికరంగానే జరుగుతున్నాయి గానీ అక్కడ తీసుకున్న నిర్ణయాలు అమలు కావడం లేదు. సంస్థలోని న్యాయవాదులు ఒక 'లాయర్స్ నెట్వర్క్'గా వ్యవహరించి న్యాయవ్యవస్థలో పౌరహక్కుల చైతన్యం పెంపొందించడానికి కృషి చేయాలన్న నిర్ణయం అమలు కాలేదు. అంతేకాక 1996లో జరిగిన వర్క్‌షాప్‌లో మూడునెలల కొకసారి ఒక మానవ హక్కుల న్యాయ వాదుల బులెటిన్ ప్రచురించాలని నిర్ణయం తీసుకోవడం జరిగింది. దానికొక సంపాదక వర్గాన్ని కూడ నిర్ణయించుకోవడం జరిగింది. ఈ నిర్ణయం అసలే అమలు కాలేదు. బులెటిన్ తొలి సంచిక కూడ ఇప్పటిదాకా రాలేదు.

మానవ హక్కుల న్యాయవాదుల బులెటిన్ తీసుకురాలేకపోయాము గానీ వివిధ మానవ హక్కుల సమస్యలపైన కోర్టులు ఇచ్చిన తీర్పులను క్రోడీకరించి పౌరహక్కుల ఉద్యమకారులకూ న్యాయవాదులకూ ఉపయోగపడే 'డైజెస్ట్' ప్రచురించాలన్న నిర్ణయం మాత్రం అమలు చేయగలిగాము. ఈ ప్రచురణ బాగా ఆదరణ పొందింది. అందులో చేర్చని తీర్పులేవైనా ఉంటే మనకు తెలియజేయమనీ రివైజ్ చేసేటప్పుడు వాటిని చేరుస్తామనీ పాఠకులను కోరాముగానీ ఇంతవరకు సూచనలేవీ రాలేదు. అయితే నేరస్మృతికి సంబంధించిన తీర్పులనే డైజెస్ట్‌లో ఎక్కువగా ప్రస్తావించడం జరిగింది. రాజ్యాంగ చట్టాన్ని గురించి ఇచ్చిన తీర్పులను కూడ చేర్చవలసి ఉంది. ఈ సారి వాటిని కూడ చేర్చి రివైజ్ చేస్తే ఆ ప్రచురణ మరింత ఉపయోగకరంగా ఉంటుంది.

(2) ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి గురించి అధికారికంగా ప్రకటించిన 'వైట్‌పేపర్' ను విమర్శిస్తూ ఒక ప్రత్యామ్నాయ వైట్‌పేపర్ మనం తయారు చేసి ప్రజల ముందు ఉంచాలనుకున్నాం. ప్రభుత్వ వైట్ పేపర్ ప్రధాన ఉద్దేశ్యం బియ్యం సబ్సిడీనీ కరెంటు సబ్సిడీనీ ఐఎంఎఫ్ ఎల్‌పైన నిషేధాన్నీ ఎత్తివేయకపోతే ప్రభుత్వం దగ్గర అభివృద్ధి పనులకు అవసరమైన ఆర్థిక వనరులు ఉండవని చెప్పడం. అవేవీ చేయకుండ కూడ వనరులు సంపాదించుకునే మార్గాలు, ఖర్చు ఆదా చేసే మార్గాలు ఉన్నాయని వివరిస్తూ మనం ప్రత్యామ్నాయ వైట్‌పేపర్ ప్రకటించాలనుకున్నాం. ప్రభుత్వ విధానాన్ని విమర్శిస్తూ 'స్వేచ్ఛ'లో కొన్ని వ్యాసాలు రాశాం కాని ఈ పని మాత్రం చేయలేకపోయాం. ఇక మీదటయినా చేయాలి. ఎందుకంటే ఈ రకమైన కుతర్కం రాబోయేకాలంలో సంక్షేమ వ్యవస్థను మొత్తంగా మూసేయడానికి కూడ ఉపయోగపడగలదు.

(3) తెలంగాణ జిల్లాలలో నక్సలైట్ల నాయకత్వంలో పేదప్రజలు దున్నుకున్న భూముల గురించి సర్వే చేయాలని అనుకున్నాము. ఆ భూములు పోలీసు జోక్యంవల్ల ఎక్కువ భాగం బీడున్నాయి. మనం సర్వే చేసి ఆ భూమిని దున్నుకున్న పేదలకూ ఇతర అర్హులయిన పేదలకూ ప్రభుత్వమే పట్టాలు ఇయ్యాలనీ ఈ భూములు దున్నుకున్నందుకు పెట్టిన క్రిమినల్ కేసులు ఎత్తేయాలనీ డిమాండ్ చేయాలనుకున్నాం. ఇది అమలు కాలేదు. కానీ ఈ భూమి సమస్య ఒక ముఖ్యమైన సమస్య కాబట్టి ఇక మీదటయినా చేయాలి. అయితే ఈ సర్వే చేసేటప్పుడు భూస్వాములు కాని వారి భూములలో జెండాలు పాతిన ఘటనలు ఎదురయితే వాటి విషయంలో ఏ వైఖరి అవలంబించాలో సంస్థ నిర్ణయించుకోవలసి ఉంటుంది. ఆ భూములు కూడ పేదలకు పంచాలని అనలేము. అదే సమయంలో అటువంటి భూములలో జెండాలు పాతడం సరయిన చర్యకాదని విమర్శించడం మన పరిధిలోని విషయంకాదని అవగాహన పైన జరిగిన చర్చలో నిర్ణయించడం జరిగింది. వీటి విషయంలో ఏ విధంగా వ్యవహరించాలో మహాసభ చర్చించి సంస్థకు గైడెన్స్ ఇయ్యవలసి ఉంటుంది.

(4) శవపరీక్ష నివేదికలు (పోస్ట్‌మార్టం రిపోర్టులు) రాసే విషయంలో డాక్టర్లు వ్యక్తం చేస్తున్న నిర్లక్ష్యవైఖరి గురించి, పోలీసుల పట్ల వారు తరచుగా ప్రదర్శిస్తున్న లొంగుబాటు వైఖరి గురించి, మనం ఆందోళన చేపట్టాలనీ అందులో భాగంగా ముందు డాక్టర్ల వృత్తిపరమైన సంస్థ అయిన ఇండియన్ మెడికల్ అసోసియేషన్‌కు (ఐఎంఏ) వివరంగా ఒక లేఖరాసి వారితో చర్చించాలనీ అనుకున్నాం. ఇది అమలు కాలేదు. ఇది వీలయినంత త్వరలో మనం చేపట్టవలసిన కార్యక్రమం. లాకప్ హత్యలు, స్త్రీల బలవన్మరణాలు, దళితుల హత్యలు మొదలయిన కేసుల్లో పోస్ట్‌మార్టం రిపోర్టు వాస్తవాలకు అనుగుణంగా లేకపోతే మనమెంత ఆందోళన చేసినా కేసు

పెట్టించడం అసాధ్యంగా ఉందనేది మన అనుభవం.

(5) ఖైదీల హక్కుల గురించి వివరమైన ప్రచురణ తీసుకురావాలన్నది దీర్ఘకాలంగా అమలు కాకుండ ఉండిపోయిన నిర్ణయం. ఇందులో చట్టాల గురించి, కోర్టు తీర్పుల గురించి వివరించాలనీ వాటితో బాటు జైళ్లలోని వాస్తవ పరిస్థితులను కూడ వివరించి చట్టాలకూ కోర్టు తీర్పులకూ ఇవి ఎంత భిన్నంగా ఉన్నాయో ఎత్తి చూపాలనీ అనుకున్నాం. ఈ ప్రచురణ తీసుకురాలేకపోవడం విచారకరం. గత కొద్ది సంవత్సరాలుగా మన రాష్ట్రంలోని జైళ్లలోని ఖైదీలు నక్సలైట్ ఖైదీల నాయకత్వంలో తమ సమస్యలపైన ఆందోళనలు తరచుగా చేపడుతున్నారు. మనం కూడ అందుకు సంఘీభావంగా ప్రకటనలు ఇవ్వడం, ఐక్య కార్యచరణ కమిటీలలో భాగమయి సంఘీభావ కార్యక్రమాలలో పాల్గొనడం చేస్తున్నాం. మన బాధ్యతగా మనం ఎంపిక చేసుకున్న ఈ ప్రచురణను ఈపాటికి తీసుకొచ్చి ఉంటే ఖైదీల ఆందోళనలకు ఉపయోగకరంగా ఉండేది. ఆ బాధ్యత అప్పగించిన రాష్ట్ర కమిటీ సభ్యుడు (గుంటూరు జిల్లా శాఖ కార్యదర్శి) ఇప్పుడు రాష్ట్ర కమిటీలో లేడు. అయినప్పటికీ ఈ ప్రచురణ బాధ్యత నిర్వర్తించడానికి అతనికి అభ్యంతరం లేకపోతే దానిని అతనికే అప్పగించి ఒక నియమిత కాలంలో పూర్తి చేయమని చెప్పాలి. లేదా ఈ బాధ్యత వేరే ఎవ్వరికైనా అప్పగించాలి.

(6) ఎస్‌సి, ఎస్‌టి (అత్యాచారాల నిరోధక) చట్టం గురించి వివరమైన ప్రచురణ తీసుకురావాలని విజయనగరం, కర్నూలు జిల్లా శాఖలు చేసిన సూచన మేరకు ఆ నిర్ణయం తీసుకోవడం జరిగిందిగానీ అమలు కాలేదు. ఇక మీదటయినా చేయాలి.

(7) మహిళా ఉద్యోగినులు పనిస్థలంలో ఎదుర్కొనే లైంగిక వేధింపులను నివారించడానికి సుప్రీంకోర్టు విశాఖ వెర్సస్ స్టేట్ కేసులో సూచించిన నిర్మాణాత్మకమైన చర్యలకు కరపత్రంగా అచ్చువేసి ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలలోనూ విద్యా సంస్థలలోనూ పంచాలనీ కార్మిక సంఘాలతో దాని అమలు గురించి చర్చించాలనీ అనుకున్నాము గానీ ఇది జరగలేదు. ఇక మీదటయినా చేయాలి.

## జిల్లాలు

ఇంక జిల్లా శాఖలు నిర్వహించిన కార్యకలాపాలనొకసారి పరిశీలిద్దాం. ఒక్కొక్క జిల్లా శాఖ పనితీరును విడివిడిగా చర్చించకుండ, పనివిధానంలో విస్తృతినీ, గాఢతనూ ప్రమాణంగా పెట్టుకొని స్థూలంగా పరిశీలిద్దాం.

మనం చేపడుతున్న పౌరహక్కుల సమస్యలుగా ఈ కింది వాటిని గుర్తించవచ్చు. పోలీసు హింస (ముఖ్యంగా లాకప్ మరణాలు, ఎన్‌కౌంటర్‌లు), దళిత కులాలపైన ఆధిపత్య కులాలవారి భౌతిక దాడులు, అంటరానితనం పాటించడం, కాలేజీలలో, ఉద్యోగాలలో రిజర్వేషన్లు పాటించకపోవడం, స్త్రీలపైన లైంగిక అత్యాచారాలు, బలవన్మరణాలు, పారిశ్రామిక కాలుష్యం సమస్య, ఫాక్టరీ కార్మికుల హక్కుల సమస్యలు, ఏజెన్సీ ప్రాంతాలలో 1 ఆఫ్ 70 సమస్య, పట్టణాలలో గుడిసెవాసుల బలవంతపు తొలగింపు, రాయలసీమలో ఫాక్షన్ ముఠాల దాడులు, దౌర్జన్యాలు, ఫ్యాక్టరీల మూసివేత, సమ్మెలపైన, ఉద్యమాలపైన అణచివేత మొదలయినవి. ఈ కోవకు చెందిన ప్రతీ సమస్యకు మనం స్పందించడం లేదు గానీ ఇవన్నీ మన అజెండాలో ఉన్నాయి. ఆచరణలో ప్రతీ సమస్యనూ కాకపోయినా కొన్నిటిని చేపట్టడం జరుగుతున్నది. స్త్రీల సమస్యల విషయంలో అవసరమున్న మేరకు స్పందించలేక పోతున్నామనేది అధిక భాగం జిల్లా శాఖలు చేసుకుంటున్న ఆత్మవిమర్శ.

స్పందించిన విషయాలలో కూడ ఎంత లోతుగా స్పందిస్తున్నామని చూడాలి. మనం చేయగల పనిని ఈ క్రింది దశలుగా విభజించుకోవచ్చు.

1. హక్కుల అతిక్రమణ మన దృష్టికి రాగానే నిరసన తెలుపుతూ ప్రకటన ఇవ్వడం.
2. నిజనిర్ధారణ చేసి వివరమైన రిపోర్టు విడుదల చేయడం.
3. విషయాన్ని ప్రజలకు వివరించడానికి కరపత్రాలు, సభల రూపంలో ప్రచారం చేపట్టడం.
4. బాధితులకు న్యాయం చేయమని అధికార యంత్రాంగంపైన ఒత్తిడి పెట్టడానికి ఆందోళన చేపట్టడం, అందుకోసం అవసరమయితే ఇతర ప్రజాసంఘాలను కలుపుకొని ఐక్య కార్యచరణ కమిటీలు వేయడం.
5. బాధితుల తరపున కోర్టులో కేసు వేయడం, లేదా ప్రభుత్వమే కేసు పెట్టినప్పుడు ప్రాసిక్యూషన్‌కు, బాధితులకు సహకరించడం.

మన కార్యక్రమాలలో ఎక్కువభాగం మనం మొదటి రెండు దశల దగ్గరే ఆగిపోతున్నట్టు జిల్లా కార్యదర్శుల నివేదికలను బట్టి అర్థం అవుతుంది. వనరుల లోపం, కార్యకర్తల లోపం, చొరవలో లోపం మొదలయిన కారణాలనేకం ఉంటున్నాయి. ఏమయినా, అక్కడే ఆగిపోతే మనం సమస్యకు చేయగల న్యాయం చేసినట్టుకాదు. అక్కడే ఆగిపోకుండ చివరిదాకా నిలబడిన కొన్ని ఘటనలు ఇక్కడ పేర్కొంటాము.

తూర్పు గోదావరి జిల్లా రామచంద్రాపురం ఎంఎల్‌ఏ తోట త్రిమూర్తులు తన స్వగ్రామంలో ఇద్దరు దళితులకు బలవంతంగా

శిరోముండనం చేయించిన ఘటనలో మన జిల్లా శాఖ మొదటి నుండి ఈనాటి దాకా దళితులకు అండగా ఉంది, ఉద్యమాలలో పాల్గొనింది. కేసు పెట్టించడానికి; అరెస్టు చేయించడానికి, బాధితుల పునరావాసానికి ఆందోళన జరిగింది. అందుకోసం వివిధ దళిత, ప్రజా సంఘాలతో ఐక్య కార్యచరణ కమిటీ ఏర్పడింది. ఎంఎల్ఏ ఆ కేసును విశాఖపట్నంకు బదిలీ చేయించుకొని కోర్టుకు హాజరుకాకుండ జాప్యం చేస్తుంటే దానికి వ్యతిరేకంగా విశాఖపట్నంలో ఈ ఐక్య కార్యాచరణ కమిటి ఆధ్వర్యంలో జరిగిన ఆందోళనలో మన తూర్పు గోదావరి, విశాఖ పట్నం జిల్లా శాఖలు పాల్గొన్నాయి. చివరికి ఇప్పుడు కోర్టులో విచారణ మొదలయిన తరువాత రాష్ట్ర ప్రభుత్వం గుట్టుచప్పుడు కాకుండా త్రిమూర్తులుపైన కేసు ఎత్తివేయాలని ఆర్డర్ జారీ చేసింది. దానిని సవాలు చేస్తూ హైకోర్టులో మనమే రిట్‌పిటిషన్ దాఖలు చేసాము.

పశ్చిమ గోదావరి, నెల్లూరు, కర్నూలు, మహబూబ్‌నగర్ జిల్లాలలో కూడ దళితులపైన అత్యాచారాలు జరిగిన కొన్ని ఘటనల్లో కేసు పెట్టించడం, అరెస్టులు చేయించడం, బాధితులకు పునరావాసం కల్పించడం అనే మూడు దశలలోనూ మన జిల్లా కమిటీయే చొరవ తీసుకొని దళిత సంఘాలనూ, ఇతర ప్రజా సంఘాలనూ కలుపుకొని ఆందోళన నడిపించింది.

విశాఖపట్నంలో భారత్ పెట్రోలియం కార్పొరేషన్ అధికారులు మాలోతు కిషన్ అనే లంబాడీ గిరిజన తెగకు చెందిన ఇంజనీర్ పనితీరు సరిగ్గా లేదని ఉద్యోగం నుండి తొలగించిన ఘటనలో కూడ ఇతర సంఘాలను కలుపుకొని ఆందోళన చేసి యాజమాన్యంపైన క్రిమినల్ కేసు పెట్టించి చివరికి కిషన్‌ను ఉద్యోగంలోకి తీసుకునేటట్టు ఒత్తిడి పెట్టిన ఉద్యమంలో మనం ముఖ్యపాత్ర నిర్వహించాము.

గుంటూరు జిల్లాశాఖ చిలకలూరిపేట ఉరిశిక్ష కేసులో నిర్వహించిన పాత్ర తెలిసిందే.

మహబూబ్‌నగర్ జిల్లా నివాసి అయిన హుసేన్‌బీని స్పెషల్ పోలీసులు ఈ సంవత్సరం ఏప్రిల్ 8న బలవంతంగా అపహరించి అత్యాచారం చేసిన కేసులో మహబూబ్‌నగర్ జిల్లా శాఖ, జంటనగరాల శాఖ ఆమెకు అండగా నిలిచాయి. ప్రభుత్వం ఆమెపైన అత్యాచారం చేసిన పోలీసు సిబ్బందిని అరెస్టు చేసింది. వివిధ ప్రజాసంఘాలను కలుపుకొని ఒక ఐక్య కార్యచరణ కమిటీని ఏర్పాటు చేసి ఆందోళన చేసారు. ఆ తరువాత ఆమె భర్త ఈదన్న అనుమానాస్పద పరిస్థితులలో అపహరణకూ, హత్యకూ గురికాగా అప్పటివరకు జరిగిన ఘటనల నేపథ్యంలో అతనిని పోలీసులే కిడ్నాప్ చేసి చంపారని భావించాము. అదే కమిటీ ఆధ్వర్యంలో ఈదన్న హంతకులను అరెస్టు చేయాలన్న ఆందోళన సాగింది. అయితే చివరికి మనం పొరబడ్డామనీ, ఈదన్నను చంపింది పోలీసులు కాదనీ తెలిసింది. మనం పొరబడడం కొంతమేరకు సహజమే అయినప్పటికీ మనవల్ల తప్పు జరిగింది కాబట్టి ప్రజల నుండి క్షమాపణ కోరడం ఉచితంగా ఉంటుందని భావించి ఆ మేరకు ప్రకటన ఇచ్చాము. మనం ఆందోళనలు చేసేటప్పుడు పూర్తి వాస్తవాలను నిర్ధారించుకోవడం ఎంత అవసరమో ఈదన్న ఉదంతం నొక్కి చెప్పింది.

నెల్లూరు జిల్లా ఆత్మకూరు పోలీస్‌సర్కిల్‌లోని రెండు పోలీస్ స్టేషన్లలో సామూహిక అత్యాచారానికీ దాదాపు మూడు వారాలు అక్రమనిర్బంధానికీ గురయిన వరమ్మ కేసులో ఆ జిల్లాశాఖ మానవ హక్కుల కోర్టులో కేసువేసి, దళిత సంఘాలను కలుపుకొని ఆందోళన చేసి న్యాయం జరిపించడానికి చాలా కృషి చేసింది.

తెలంగాణలో ఎన్‌కౌంటర్ల గురించి నిజనిర్ధారణ చేసి ప్రకటన ఇవ్వడం దగ్గరే మనం ఎక్కువ భాగం ఆగిపోతున్నాం. కొన్ని సందర్భాలలో మృతుల కుటుంబాలకు ఎస్‌సి కార్పొరేషన్ నుండి గానీ, సోషల్ వెల్ఫేర్ శాఖ నుండి గానీ రుణాలు, భూమి మొదలయిన రూపాలలో పునరావాసం కల్పించవలసిందిగా వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్‌లకు విజ్ఞప్తి చేసాము. వాళ్ల హామీలయితే ఇచ్చారుగానీ మనం ఫాలోఅప్ చేయలేకపోవడం వల్ల ఫలితం ఎక్కువ లేకుండా పోయింది. అయితే మెదక్ జిల్లాలో జరిగిన రెండు ఎన్‌కౌంటర్‌ల మీద హైదరాబాద్‌కు చెందిన పౌరహక్కుల సంఘం న్యాయవాదులు హైకోర్టులో వేసిన రిట్‌పిటిషన్‌ల ఫలితంగా హైకోర్టు రెండవసారి శవపరీక్ష జరిపించి విచారణకు ఆదేశం ఇచ్చింది. ఒక దానిపైన (లక్ష్మాపూర్) సిబిఐ ఇన్వెస్టిగేషన్, రెండవ దానిపైన (రామేశ్వర్, రాజుల హత్య) మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టులో విచారణ నడుస్తున్నాయి. మరొక (అదే జిల్లాకు చెందిన) ఘటనలో (గోసాన్‌పల్లి) మృతుని బంధువుల చేత మన జిల్లా శాఖ బాధ్యులు ఇప్పించిన టెలిగ్రాం ఆధారంగా హైకోర్టు మెదక్ జిల్లా మొదటి అదనపు జిల్లా జడ్జి చేత విచారణ జరిపిస్తున్నది. ఈ మూడు విచారణలలోనూ మనం పాల్గొని మన నిజనిర్ధారణ ఫలితాన్ని వివరించడమే కాక, సాక్షులకు కూడ ధైర్యం ఇచ్చి వాస్తవాలు చెప్పించాము.

భవిష్యత్తులో ఎన్‌కౌంటర్ల విషయంలో చేపట్టవలసిన ఒక కార్యక్రమాన్ని ఇక్కడే ప్రస్తావించడం ఉచితంగా ఉంటుంది. ఎస్.సి, ఎస్‌టి (అత్యాచారాల నిరోధక) చట్టానికి అనుబంధంగా రాష్ట్ర ప్రభుత్వం 1995లో జారీ చేసిన జీవోలో పోలీసు కాల్పులలో చనిపోయిన దళితులకు, గిరిజనులకు లక్ష రూపాయల నష్టపరిహారం ఇవ్వాలని చెప్పింది. గుంపును చెదరగొట్టడానికి పోలీసులు జరిపే కాల్పులలో

చనిపోయిన ఎస్.సి, ఎస్.టిలకు ఈ జివో ప్రకారం నష్ట పరిహారం ఇస్తున్నారు. అయితే ఎన్‌కౌంటర్ కూడ పోలీసు కాల్పుల ఘటనే కాబట్టి ఆ జివో ప్రకారం ఎన్‌కౌంటర్‌లో చనిపోయే ఎస్‌సి, ఎస్‌టిలకు కూడ ఆ నష్టపరిహారం ఇవ్వాలని అడిగే అవకాశం ఉంది. 1995 తరువాత జరిగిన ఎన్‌కౌంటర్లలో చనిపోయిన ఎస్‌సి, ఎస్‌టిల జాబితా ఆయా జిల్లా కలెక్టర్లకు ఇచ్చి వాళ్ల కుటుంబాలకు నష్టపరిహారం ఇమ్మని అడగాలి. వాళ్లు తిరస్కరిస్తే కోర్టులో కేసువేయాలి.

అంతిమ ఫలితం దక్కినా దక్కకున్నా, నిజనిర్ధారణ దగ్గర ఆగిపోకుండా ప్రచార ఆందోళన కార్యక్రమాలు చేపట్టడం జిల్లా శాఖలు కొన్ని సందర్భాలలోబాగానే చేస్తున్నాయి.

వరంగల్ జిల్లాలో తీవ్ర నిర్బంధం మధ్యకూడ ఒక్క ఎన్‌కౌంటర్లను మినహాయించి మిగిలిన ఘటనలపై (ఆమెడ నారాయణ హత్య, గిరిజన యువతి సమ్మక్కపైన అత్యాచారం వగైరా) పలు సంఘాలను కలుపుకొని ఆందోళన చేయడం జరిగింది. సమ్మక్కపైన అత్యాచారం చేసిన వారిపైన కేసుపెట్టి అరెస్టు చేశారు. ఈ మధ్యనే వారికి 7 సం.ల జైలు శిక్ష కూడా పడింది.

హైదరాబాద్ నగరశాఖ బస్తీలలో స్త్రీలపైన అత్యాచారం జరిగిన ఘటవలలో, లాకప్ మరణాల కేసులలో, గుడిసె వాసులను బలవంతంగా తొలగించిన ఘటనలలో, ఫ్యాక్టరీలు మూసివేసి కార్మికులను వీధిపాలు చేసిన ఘటనలలో స్థానికంగానే ధర్నాలు, సభలు నిర్వహిస్తూ వుంది.

పశ్చిమగోదావరి శాఖ ఆ జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో 1ఆఫ్ 70 అమలు కోసం గిరిజనులు చేస్తున్న ఆందోళనకు సంఘీభావంగా కార్యక్రమాలు నిర్వహించింది.

సివిల్ కేసులలో పోలీసులు జోక్యం చేసుకొని బెదిరింపుతో బలవంతంగా పరిష్కారం చేసే దురలవాటు రాష్ట్ర వ్యాపితంగా ఉంది. చాలాచోట్ల పోలీసులు 'దర్బారులు' నిర్వహించి మరీ ఈ పని చేస్తున్నారు. విజయవాడలో నగర పోలీస్ కమిషనర్ డి.టి. నాయక్ నిర్వహిస్తున్న పోలీసు దర్బారులను మన జిల్లా శాఖ 1996లో హైకోర్టు దృష్టికి తీసుకొచ్చింది. అటువంటి దర్బారులు నిర్వహించటం చట్ట వ్యతిరేకమని హైకోర్టు తీర్పు ఇచ్చింది.

హైదరాబాద్‌లోనూ నల్గొండలోనూ 1996లో జరిగిన మత ఘర్షణల నేపథ్యంలో జంట నగరాల శాఖ ఆధ్వర్యంలో పాత బస్తీ వీధులలోనూ నల్గొండశాఖ ఆధ్వర్యంలో ఆ పట్టణ వీధులలోనూ మతోన్మాద వ్యతిరేక ర్యాలీలు జరిగాయి.

పులిచింతల ప్రాజెక్టుకు సంబంధించిన పర్యావరణ ప్రభావాన్ని పరిశీలించడానికి వస్తున్న నిపుణుల వద్దకు పోయి, ఆప్రాజెక్టు పట్ల తమ వ్యతిరేకత తెలియజేయవలసిందిగా పులిచింతల ముంపు ప్రాంత గ్రామాలలో మన నల్గొండ జిల్లాశాఖ కరపత్రాలు పంచింది. హైదరాబాద్ వచ్చిన పర్యావరణ ఉద్యమ నాయకురాలు మేధాపాట్కర్‌ను నల్గొండకు పిలిపించి సదస్సు నిర్వహించింది.

అనంతపురం జిల్లాశాఖ ఆ జిల్లాలోని ముఠాకక్షలమీద వివరంగా సర్వే జరిపి సమాచారం సేకరించింది. 'కరువు జిల్లాలో కొత్త పాలెగాళ్లు' అన్న శీర్షికతో ఆ నివేదికను ఈ సభల సందర్భంగా ప్రచురిస్తున్నాము. ఆ జిల్లాలో కరువు నిధుల దుర్వినియోగం గురించి హైకోర్టులో రిట్ పిటిషన్ వేసి, నిధుల దుర్వినియోగానికి లేదా అవినీతికి పాల్పడినవారిపైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించవలసిందిగా కోరాము.

మహబూబ్‌నగర్ జిల్లా శాఖ అనేక విషయాలపైన ప్రచారం, ఆందోళన చేపడుతున్నది. ధర్నాలు, బహిరంగ సభలు నిర్వహిస్తున్నది. కొన్ని సందర్భాలలో ఐక్య కార్యాచరణ కమిటీలు వేసి ఆందోళన చేస్తున్నది.

విశాఖపట్నం హెచ్‌పిసిఎల్‌లో 97 సెప్టెంబర్ 14న ఘోరప్రమాదం జరిగి 60 ప్రాణాలుపోయిన దుర్ఘటన పైన జిల్లా కమిటీ వివరంగా నిజనిర్ధారణ జరపడమేకాక ప్రభుత్వం నియమించిన విచారణ కమిషన్ ముందు వివరమైన అఫిడవిట్ దాఖలు చేసి విచారణలో పాల్గొంటూ ఉంది.

కర్నూలు జిల్లాశాఖ, ఆ జిల్లాలో దళితులపైన జరుగుతున్న దాడుల గురించి చేపట్టిన నిజనిర్ధారణ పరిశోధనకు కొనసాగింపుగా, ఎస్‌సిఎస్‌టి అత్యాచారాల నిరోధక చట్టం గురించి ఈ సంవత్సరం మే నెలలో నంద్యాలలో సదస్సు నిర్వహించింది.

శ్రీకాకుళం జిల్లా శాఖ, ఏజెన్సీలో చేర్చని గిరిజన ప్రాంతాల ప్రజలకు '1 ఆఫ్ 70' లేకపోవడం వల్ల వచ్చిన సమస్యలపైన సర్వే జరిపి, ఆ ప్రాంతాలను ఏజెన్సీలో చేర్చాలన్న డిమాండ్‌తో పలాసలో సదస్సు నిర్వహించింది.

పోలీసు కస్టడీలో హింస, మరణాలు, అత్యాచారాల కేసులలో మన జిల్లా శాఖలు ఆందోళనల ద్వారా, కోర్టు పిటీషన్లద్వారా పోలీసులపైన కేసులు పెట్టిన ఘటనలు ఈ రెండేళ్ళలో కొన్ని జరిగాయి. మనం చొరవ తీసుకొని ఆందోళన జరిపిన ఫలితంగా హన్మకొండ (వరంగల్ జిల్లా), వినుకొండ (గుంటూరు జిల్లా), అవనిగడ్డ (కృష్ణాజిల్లా), ఒంగోలు వన్‌టౌన్ (ప్రకాశం జిల్లా), వెలుగోడు,

డోన్ (కర్నూలు జిల్లా) పోలీసు స్టేషన్లలో జరిగిన కస్టడీ మరణాలపైన కేసులు పెట్టారు. గుడివాడ రైల్వే పోలీసులపైన (కృష్ణాజిల్లా), పరకాల (వరంగల్ జిల్లా), నగిరి (చిత్తూరు జిల్లా) ఎక్సైజ్ పోలీసులమీద కూడా వాళ్ళ చేతులలో జరిగిన మరణాలపైన కేసులు పెట్టించగలిగాము. కర్నూలు జిల్లా నంద్యాలలో శాంతిప్రియ అనే మహిళను రేప్ చేసిన పోలీసులపైన, వరంగల్ జిల్లా భీమారం పోలీసు క్వార్టర్స్ దగ్గర లచ్చవ్వ అనే స్త్రీపైన అత్యాచార ప్రయత్నం చేసిన పోలీసు కానిస్టేబుల్‌పైన కూడా కేసు పెట్టించగలిగాము.

కొన్ని జిల్లాలలో కొన్ని సంఘటనలనే పేర్కొంటున్నామంటే వేరే జిల్లాలు ఇటువంటి పనులు చేయడం లేదని కాదు. ప్రకటనలు, నిజనిర్ధారణ రిపోర్టుల దగ్గర ఆగిపోకుండా ప్రచార ఆందోళన కార్యక్రమాలు చేపట్టిన ఉదాహరణలు, విచారణలో పాల్గొని న్యాయం సాధించడానికి ప్రయత్నించిన ఉదాహరణలు పేర్కొనడం ఇక్కడ ఉద్దేశ్యం.

అయితే ఇటువంటి కార్యక్రమాలు కొన్ని సందర్భాలలో చేపడుతున్నప్పటికీ ఎక్కువ భాగం 'ఫాలో అప్' చేయడం లేదనేది వాస్తవం. దీనికి కారణాలు ఏవైనా ఈ పరిమితినుండి సంస్థ బయటపడడం అవసరం.

హక్కుల విషయంలో ప్రజలలో చైతన్యం పెంచడం మన కార్యరంగంలోని ముఖ్య లక్ష్యాలలో ఒకటి. దానికి సభలు, కరపత్రాలు ముఖ్యసాధనాలు. సభలు జిల్లా కేంద్రంలోనే కాక అన్ని ప్రాంతాలలోను జరపాలనీ, ముఖ్యంగా ఒక అత్యాచారం లేక అణచివేత జరిగిన చోట సభ జరిపితే ఆ ఘటన గురించే కాక పలు ఇతర విషయాల గురించి మాట్లాడే అవకాశం కూడ ఉంటుందని గతంలో చాలా సార్లు అనుకున్నాము. అయితే ఇది కూడ సమగ్రంగా అమలు కావడంలేదు. స్థానిక సమస్యలమీద ఎక్కువగా కరపత్రాలు వేసిన జిల్లాశాఖ పశ్చిమగోదావరి. జిల్లా కేంద్రంలోనే కాక తాలూకా, మండల కేంద్రాలలో బహిరంగసభలు నిర్వహించి పౌరహక్కుల ప్రచారం చేపట్టాలన్న సూచనకూడ మహబూబ్‌నగర్, పశ్చిమగోదావరి జిల్లాలలోనే కొంతమేరకు అమలయింది. ఉత్తర తెలంగాణా జిల్లాలలో ఇది సాధ్యం కాకపోవచ్చునుగానీ తక్కిన జిల్లాలలో సాధ్యమయి కూడ ఆచరించడంలేదు.

## పొరుగు రాష్ట్రాలు

కాశ్మీర్, అస్సాం, బీహార్ రాష్ట్రాలలోని పౌరహక్కుల అతిక్రమణ గురించి మనం ఇతర ప్రాంతాల పౌరప్రజాస్వామ్య హక్కుల సంస్థలతో కలిసి నిజనిర్ధారణ కమిటీలలో ఈ రెండు సంవత్సరాల కాలంలో పాల్గొన్నాము. కాశ్మీర్‌లో రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరిగి ఫరూక్ అబ్దుల్లా ప్రభుత్వం ఏర్పడిన తరువాత సైన్యం పాత్ర క్రమంగా తగ్గించి రాష్ట్ర పోలీసుల పాత్రను పెంచుతున్నప్పటికీ అణచివేత ఏమాత్రం తగ్గలేదని ఫిర్యాదులు వినపడిన నేపథ్యంలో 1997 వేసవిలో పియుడిఆర్, సిపిడిఆర్‌లతో కలిసి ఎపిసిఎల్‌సి కూడ కాశ్మీర్‌కు పోయిరావడం జరిగింది. ఆ పర్యటన నివేదిక Civil war and uncivil Government అనే పేరుతో ప్రచురించాము. ఫరూక్ అబ్దుల్లా ప్రభుత్వం, పోలీసుల పంచన చేరిన మాజీ మిలిటెంట్లను కిరాయి హంతకులుగా వాడుకోవడమే కాక, వారికి పోలీసు శాఖలో ఉద్యోగాలిచ్చి వారి నేరాలకు ఖాకీ యూనిఫారం తొడుగుతున్నదని ఆ నివేదికలో విమర్శించాము.

అస్సాంలో మానవ్ అధికార్ సంగ్రాం సమితి కార్యకర్తలను, నాయకులను పోలీసులు అరెస్టు చేసి సాయుధపోరాట సంస్థ అయిన 'అల్ఫా' తో సంబంధాలున్నాయని కేసులుపెట్టి ఒకరి తరువాత ఒకరిని జైలుకు పంపిస్తున్నదని, బెయిలు పొందినవారిని జైలులోనే ఉంచడానికి 'నాసా' ప్రయోగిస్తున్నదనీ తెలిసి పియుడిఆర్, ఎపిడిఆర్‌లతో కలిసి నిజ నిర్ధారణ కమిటీగా 1997 నవంబర్ నెలలో గౌహతి తదితర పట్టణాలు పర్యటించడం జరిగింది. గౌహతిలోనూ, కలకత్తాలోనూ ప్రెస్ కాన్ఫరెన్స్ పెట్టాము.

బీహార్ రాష్ట్రంలోని లక్ష్మణపూర్ బాతెలో రణబీర్ సేన అనే భూమిహార్ కులానికి చెందిన ప్రైవేట్ సైన్యం దళిత, బిసి కులాల పేదలను 62 మందిని ఊచకోతకోసిన ఘటన తరువాత జెహానాబాద్, పాట్నా జిల్లాలలో పేదలు, ముఖ్యంగా ఎం-ఎల్ పార్టీల అనుయాయులు రణబీర్‌సేన దాడులకూ, పోలీసు దాడులకూ గురి అవుతున్నారని తెలిసి దేశంలోని ఏడు పౌరహక్కుల సంఘాల ప్రతినిధులు నిజనిర్ధారణ కమిటీగా ఏర్పడి ఈ సంవత్సరం ఫిబ్రవరినెలలో బీహార్‌కు పోయి ఆ రెండు జిల్లాల గ్రామాలు మూడు రోజులు పర్యటించడం జరిగింది. పోలీసులు రణబీర్ సేనను పట్టుకోవడానికి ఏ ప్రయత్నం చేయకుండ నక్సలైట్లను వేటాడే ప్రయత్నంలో పేదలను, దళితులను వేధిస్తున్నారని సవివరంగా గమనించాము. పర్యటన అనంతరం పాట్నాలో ప్రెస్ కాన్ఫరెన్స్ పెట్టాము. తరువాత వివరమైన రిపోర్టు ప్రచురించాము. అది ఢిల్లీలో అచ్చవుతున్నది. బహుశా ఈ సభలనాటికి మనకు అందవచ్చు. ఈ పర్యటనలో ఎపిసిఎల్‌సి తరపున బాలగోపాల్, పురుషోత్తం, బుర్రా రాములు పాల్గొన్నారు.

## అవగాహన :

పౌరహక్కుల అవగాహన గురించి సంస్థలో కొంతకాలంగా తీవ్రమైన అభిప్రాయభేదాలున్న సంగతి తెలిసిందే. ఉద్యమకారుల అప్రజాస్వామిక చర్యలను ఖండించాలా కూడదా అన్న విభేదం ఒక్కటే కాక ఇతర విషయాలలో కూడ విభేదాలు ఉన్నాయి.

ఎటువంటి ఐక్య సంఘటనలలో, ఎవరెవరితో కలిసి పనిచేయవచ్చునన్న వివాదం మహబూబ్‌నగర్ మహాసభలకు ముందు జెపిడిఆర్ విషయంలో తలెత్తగా, గత సంవత్సరం శవాల స్వాధీన కమిటీలో పాల్గొనాలా లేదా అన్న విషయంలో తలెత్తింది. తెలంగాణా జిల్లాలలో నిర్బంధ వ్యతిరేక ఆందోళనలు చేపట్టేటప్పుడు నక్సలైట్ల సాయుధ చర్యలకు మనం సమాధానం చెప్పవలసివస్తున్నది కాబట్టి, మనం చెప్పే సమాధానానికి విశ్వసనీయత ఉండాలంటే ఆ పార్టీల ప్రజాసంఘాలతో, నక్సలైట్ రాజకీయాల ప్రతినిధులుగా పేరుపడిన వ్యక్తులతో కలిసి పనిచేయడం మంచిదికాదని కార్యవర్గంలో మెజారిటీ భావించడంవల్ల శవాల స్వాధీన కమిటీలో మనం చేరవద్దని అనుకున్నాము. ఉద్యమం డిమాండు పౌరహక్కుల డిమాండని భావించినప్పుడు కలిసి వచ్చేవాళ్లెవరితోనైనా కలిసి పనిచేయాలని కార్యవర్గంలో మైనారిటీ భావించింది.

ఈ రకమైన అభిప్రాయభేదాలు అనేక విషయాలలో తలెత్తుతున్నాయి. కాబట్టి సంస్థలో వివరంగా చర్చపెట్టుకోవడం మంచిదని 1997 జనవరిలో జరిగిన రాష్ట్ర కమిటీ బాధ్యుల సమావేశం నిర్ణయించింది. పౌరహక్కుల ఉద్యమానికి ఉండవలసిన అవగాహన గురించి ఎవరి అభిప్రాయాలు వారు ఒక చర్చా వ్యాసం రూపంలో రాసి పంపించాలనీ అన్ని వ్యాసాలనూ కలిపి అచ్చువేసి రాష్ట్ర వ్యాప్తంగా వాటిపైన చర్చ నిర్వహించాలనీ నిర్ణయించాము. అక్టోబర్ 12 నాటికి 12 పత్రాలు వచ్చాయి. వాటిని అచ్చువేసి నవంబర్ 8-9 తేదీలలో జరిగిన స్పెషల్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఒకసారి చర్చించి, ఆ తరువాత అన్ని జిల్లాలలోనూ సర్వసభ్య సమావేశాలు నిర్వహించి చర్చ జరిపాము. ఈ సంవత్సరం ఏప్రిల్ 11న జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆ చర్చను సమీక్షించి, 7 అంశాలపైన స్థూలంగా రెండు భిన్న దృక్పథాలు వ్యక్తమయ్యాయని భావించింది. ఆ 7 అంశాలలో (కార్యవర్గం గుర్తించిన) అంగీకారమున్న విషయాలను, విభేదించే రెండు భిన్న దృక్పథాలనూ వివరించే పత్రాన్ని ఈ నివేదికకు అనుబంధంగా జత చేస్తున్నాను. ఈ పత్రం ఆధారంగా రాష్ట్ర స్థాయిలో సర్వసభ్య సమావేశం నిర్వహించి చర్చ చివరిదశను పరిపూర్తి చేయాలని కార్యవర్గం భావించింది. మే నెల 8, 9, 10 తేదీలలో గుంటూరులో జరిగిన స్పెషల్ జనరల్ బాడీ ఆ విభేదాలను వివరంగా చర్చించిన మీదట, విభేదాలన్నిటినీ వోటింగ్‌కు పెట్టాలని కార్యవర్గం నిర్ణయించింది. 10వ తేదీన జరిగిన వోటింగ్‌లో విభేదాలలోని (i) వ అవగాహనకు అత్యధిక మెజారిటీ వోట్లు వచ్చాయి. దీనితో సంస్థలో చాలాకాలంగా ఉన్న అభిప్రాయ భేదాలకు ప్రస్తుతానికి తెరపడినట్లే.

**గుంటూరు స్పెషల్ జనరల్ బాడీ ఆమోదించిన అవగాహనను ధృవీకరించవలసిందిగా ఈ మహాసభను కోరుతున్నాం.**

అవగాహన గురించి చర్చ ముగిసి ఒక స్పష్టమైన ఆలోచనా సరళికి సంస్థలో మెజారిటీ మద్దతు ఉన్నదని అర్థమయిన తరువాత ఇంక ఆలస్యం చేయకుండ మహాసభలు నిర్వహించాలని కార్యవర్గం నిర్ణయించింది. సభల వరకు రాష్ట్ర కమిటీ బాధ్యులు మెజారిటీ సభ్యుల అభిప్రాయాలకు కట్టుబడి ఉన్నారు. పెద్దమల్లాపురం, చద్మల్ తాండా ఘటనలు 1991 నాటి ఖమ్మం తీర్మానం ప్రకారం ఖండించవలసిన ఘటనలే అయినా వాటిని ఖండించలేదు.

అయితే జూలై 15-16 రాత్రి కర్నూలు జిల్లా వేంపెంటలో జరిగిన ఘటన మళ్లీ సంస్థలో వివాదాస్పదమయింది. వేంపెంట ఘటన వివరాలు ఇప్పుడు చెప్పవలసిన అవసరం లేదు. అయితే ఆ ఘటనలో రెండు ఎం-ఎల్ పార్టీల మధ్య ఘర్షణ, మాల-మాదిగ కులాల మధ్య ఘర్షణ ఇమిడి ఉన్నాయి కాబట్టి గుంటూరు సర్వసభ్య సమావేశంలో వ్యక్తమయిన మెజారిటీ అభిప్రాయం ప్రకారం అది మనం చేపట్టగల సమస్యకాదని రాష్ట్ర కమిటీ బాధ్యులలో కొందరు భావించగా, అది ప్రధానంగా ఒక ఫాక్షనిస్టు దౌర్జన్యానికి సంబంధించిన సమస్య కాబట్టి గుంటూరు తీర్మానం ప్రకారం కూడ మన పరిధిలోని సమస్యేనని మరికొందరు భావించారు.

ఈ మహాసభలు ఎన్నుకోబోయే నూతన కార్యవర్గం ఈ వివాదాన్ని పరిష్కరించి, సంస్థ ఆమోదించిన అవగహన ప్రకారం నిర్ణయం తీసుకుంటుందని ఆశిస్తాము.

## సంస్థపైన దాడులు :

రాష్ట్ర సహాయకార్యదర్శి పురుషోత్తంపైన జరిగిన హత్యా ప్రయత్నమే కాక ఇతర బాధ్యులపైన, కార్యకర్తలపైన కూడ ఈ రెండు సంవత్సరాలలో పోలీసులు రకరకాల రూపాలలో వేధింపులకు పాల్పడ్డారు.

వరంగల్ జిల్లా శాఖ కార్యదర్శి అంబటి శ్రీనివాస్‌ను వృత్తిపరంగా ఇబ్బందులకు గురి చేయడానికి ఆ జిల్లా పోలీసు యంత్రాంగం ప్రయత్నించింది. అతను నర్సంపేట మేజిస్ట్రేట్ కోర్టులో న్యాయవాది. పోలీసులు అతని క్లైంట్లను బెదిరించి కేసులు వెనక్కి తీసుకొమ్మని ఒత్తిడి చేశారు. అరెస్టయినవాళ్లను శ్రీనివాస్‌ను లాయరుగా పెట్టుకోవద్దనీ పెట్టుకొంటే ఇబ్బందులకు గురి కావలసి వస్తుందనీ బెదిరించారు. కొంతకాలం పాటు అతని వృత్తిని పూర్తిగా స్తంభింపజేశారు. మనం ఈ దౌర్జన్యాన్ని రాష్ట్ర బార్ కౌన్సిల్ దృష్టికి తీసుకుపోగా వారు పోలీసుఅధికార్లకు తమ నిరసన తెలుపుతూ లేఖ రాశారు. రాష్ట్రంలోని అన్ని కోర్టులలోనూ న్యాయవాదుల చేత

సంతకాలు పెట్టించి నిరసన లేఖ బార్ కౌన్సిల్‌కు, రాష్ట్ర డిజిపికి రాయించాలనుకున్నాము గానీ కొన్ని కోర్టులలో మాత్రమే సాధ్యమయింది. ఈ కృషి ఫలితంగా ఇప్పుడు శ్రీనివాస్ క్లైంట్లపైన బెదిరింపులు తగ్గాయి.

అయితే వరంగల్‌లో పోలీసులు ఆ జిల్లా శాఖ బాధ్యులయిన అంబటి శ్రీనివాస్, బుర్రా రాములులను, జిల్లా శాఖకు చెందిన గుంటి రవి, నర్రా పురుషోత్తంలను తరచుగా బెదిరిస్తూనే ఉన్నారు. జాకారం మందుపాతర ఘటన తరువాత ఇచ్చిన నినాదాలలోనే కాక వేరే సందర్భాలలో కూడ బుర్రా రాములును, అంబటి శ్రీనివాస్‌ను చంపుతామని బెదిరించారు. గుంటి రవిని దూషిస్తూ బ్యానర్లు కట్టారు. ఉరిశిక్ష రద్దుకోసం డిమాండ్ చేస్తూ వరంగల్ జిల్లా శాఖ వరంగల్‌లో సభపెట్టినప్పుడు సభ మొదలుకావడానికి కొన్ని గంటలు ముందు పోలీసులు సభాస్థలాన్ని ఆక్రమించుకొని పౌరహక్కుల సంఘాన్ని దూషిస్తూ బ్యానర్లు కట్టారు. వాటిలో ఒకటి రవి మీద నిందలు వేస్తూ రాసిన బ్యానర్. అంతేకాక, రెండు సార్లు అతనిని, నర్రా పురుషోత్తంను రోడ్లో వెంటబడి తరుముతూ ఎక్కడికి పోతే అక్కడికి వెంబడిపోయి భయోత్పాతం సృష్టించారు. ఈ మధ్య జనగాం సిఐ వెంకటరాంనర్సయ్య నర్రా పురుషోత్తం ఆ ప్రాంతానికి వస్తే కాల్చేస్తానని పలువురు ప్రజా ప్రతినిధుల ముందు ప్రకటించాడు. ఈ ప్రవర్తన గురించి రాష్ట్ర బాధ్యులు రెండుసార్లు డిజిపిని కలిసి నిరసన తెలియజేశారు.

మెదక్‌లో సంస్థ ప్రధాన బాధ్యుడిగా (మెదక్-కరీంనగర్ జిల్లాల సంయుక్త శాఖ జాయింట్ కన్వీనర్‌గా) ఉండిన బయ్యారం రాంరెడ్డిని ఒక తప్పుడు కేసులో ఇరికించడమే కాక ఇంకా కూడ కేసులు పెడతామని పోలీసులు చాలాసార్లు బెదిరించారు. అతనిపైన పెట్టిన తప్పుడు కేసు ఎత్తివేయాలని సంగారెడ్డిలో మనం ధర్నా నిర్వహిస్తే ధర్నా జరగకుండ పోలీసులు అడ్డంపడ్డారు.

కర్నూలులో మన జిల్లాశాఖ ఉపాధ్యక్షుడిగా ఉన్న డా॥ గౌరీనాథ్‌పైన కూడ పోలీసులు తప్పుడు కేసు పెట్టారు. వేంపెంటలో పీపుల్స్‌వార్ చంపిన శివయ్య హత్య కేసులో ప్రోత్సాహం లేక సహాయం ఇచ్చిన వ్యక్తిగా (ఐపిసి సెక్షన్ 109 చేర్చి) గౌరీనాథ్‌పైన తప్పుడు కేసు పెట్టారు. వేంపెంట మారణకాండ జరిగిన మరుసటిరోజు నుండి ఆ గ్రామానికి చెందిన కొందరు గౌరీనాథ్‌ను చంపుతామని బహిరంగంగానే ప్రకటనలిస్తున్నారు. శివయ్య హత్యకు గౌరీనాథ్ కుట్రచేశాడని ప్రకటించారు. చివరికి వాళ్ల ఒత్తిడి ఫలితంగానే పోలీసులు గౌరీనాథ్‌పైన తప్పుడు కేసు పెట్టారు. ఈ తప్పుడు కేసు పట్ల మనం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి, రాష్ట్ర డిజిపికి నిరసన తెలియజేసాం.

పీపుల్స్‌వార్‌పైన నిషేధం పెట్టడం కోసం తయారు చేసిన పబ్లిక్ సెక్యూరిటీ చట్టాన్ని పోలీసులు ఎపిసిఎల్‌సి కార్యకర్తలపైన ప్రయగించి కేసులు పెట్టడం కూడ జరిగింది. మెదక్ జిల్లా బాధ్యుడు బయ్యారం రాంరెడ్డిపైన ఆ చట్టం కిందే కేసుపెట్టారు. నల్గొండ జిల్లాలో ఒక ఎన్‌కౌంటర్ విషయంలో మృతదేహం అప్పగింత గురించి పోలీసులను నిలదీసినందుకు (ప్రజా గాయకుడు గద్దర్‌తో బాటు) మన నల్గొండ జిల్లా శాఖ కార్యదర్శి, ఇతర కార్యకర్తలపైన పబ్లిక్ సెక్యూరిటీ చట్టం కింద పోలీసులు కేసుపెట్టి అరెస్టు చేసారు. చిత్తూరు జిల్లాలో పోలీసులు అరెస్టు చేసిన రాడికల్ విద్యార్థి సంఘం కార్యదర్శి తరఫున ఆ జిల్లా ఎపిసిఎల్‌సి శాఖ కార్యదర్శి క్రాంతి చైతన్య కోర్టులో కేసు వాదించాడు. కోర్టు ఆ కేసు కొట్టేసింది. అందుకు కక్షగట్టిన పోలీసులు క్రాంతి చైతన్యను, మరి నలుగురు ఎపిసిఎల్‌సి జిల్లా శాఖ కార్యకర్తలనూ అరెస్టు చేసి సాక్షులను బెదిరించారంటూ పబ్లిక్ సెక్యూరిటీ చట్టం కింద కేసు పెట్టారు.

మహబూబ్‌నగర్ జిల్లాశాఖ సహాయకార్యదర్శి ఆంజనేయులు గౌడ్, వారి గ్రామానికి బస్సువేయాలని జరుగుతున్న రాస్తారోకోలో పాల్గొంటుండగా అక్కడికి వచ్చిన అడిషనల్ ఎస్పీ అతనితో వాదనకు దిగి, కొట్టాడు.

నల్గొండలో సత్యమ్మ అనే దళిత యువతిని పెళ్లి చేసుకుంటానని చెప్పి లైంగిక సంబంధం పెట్టుకొని మోసం చేసిన వ్యక్తిపైన చర్యతీసుకోవాలని పలు ప్రజాసంఘాలతో కలిసి మన జిల్లా శాఖ ఆందోళన చేసింది. ఆ సందర్భంగా పోలీసులు మన జిల్లా శాఖ బాధ్యులపైన ఐపిసి సెక్షన్ 506 కింద కేసు పెట్టారు.

పోలీసులేకాక, మనం చేసే ఆందోళనల వల్ల నష్టపోయిన పెత్తందారీవర్గాలు మన కార్యకర్తలపైన దాడులు చేసిన సంఘటనలు కూడ జరిగాయి. గుంటూరు జిల్లాశాఖ ప్రస్తుత కార్యదర్శి అయిన మూర్తిపైన వినుకొండలో రెండుసార్లు దాడి జరిగింది. ఒక మహిళ వరకట్నం మృతి గురించి ఆందోళన చేసినందుకు ఆమె భర్త తరఫు వారు, దళితులకు అండగా నిలబడినందుకు అగ్రకుల పెత్తందార్లు అతనిపైన దాడి చేశారు.

మహబూబ్‌నగరలో మాజీ ఎంఎల్ఏ గురునాథరెడ్డి కొడుకు, అతని సహచరులు చేసిన గ్యాంగ్ రేప్ గురించి ఆందోళన చేసినందుకు మన జిల్లా శాఖ సహాయ కార్యదర్శి ప్రసాద్‌పైన గురునాథరెడ్డి మనుషులు దాడిచేసి కొట్టారు.

కర్నూలులో రాయలసీమ క్రిస్టియన్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో జరుగుతున్న అక్రమాల గురించి మన జిల్లా శాఖ ఆందోళన జరిపి

విద్యాశాఖ చేత విచారణ జరిపించి ఆ సంస్థ కరెస్పాండెంట్‌ను తొలచించేటట్టు, ఆ సంస్థకు మైనారిటీ సంస్థగా ఇచ్చిన గుర్తింపు తొలగించేటట్టు చేయగలిగాము. ఈ ఆందోళన జరిగిన క్రమంలో ఆ సంస్థ యాజమాన్యానికి సంబంధించిన మనుషులు మన జిల్లా శాఖ బాధ్యులు (ప్రస్తుత అధ్యక్ష కార్యదర్శులు) సాగర్, అల్లాబకష్‌లను చంపుతామని బెదిరించారు.

కిందటి సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వంలో ఒక అనామకుడయిన అధికారి కొన్ని యూనివర్సిటీలకు రాసిన లేఖ సంచలనం సృష్టించింది. ఉస్మానియా, నాగార్జున, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయాలలో అధ్యాపకులుగా ఉన్న ఎపిసిఎల్‌సీ బాధ్యులను ప్రస్తావిస్తూ, తీవ్రవాదులకు వత్తాసు పలుకుతూ శాంతి భద్రతల రక్షణకు అడ్డం తగులుతున్న పౌరహక్కుల సంఘంలో వారికి సభ్యత్వం ఉంటే విశ్వవిద్యాలయం అధికారులు చూస్తూ ఎట్లా ఊరుకుంటారని ఆ లేఖలో అడిగాడు. ఆ యూనివర్సిటీల అధికారులు వెంటనే ఎపిసిఎల్‌సీ బాధ్యులకు 'నీపైన చర్య ఎందుకు తీసుకోకూడదో తెలియజేయ' మంటూ నోటీస్‌లు జారీ చేశారు. ఈ విషయం బయట తెలిసి అమెరికాలో ఉన్న తెలుగువాళ్లు చాలా మంది రాష్ట్ర ప్రభుత్వానికి తమ నిరసన తెలియజేస్తూ లేఖ రాశారు. మనం కూడ రాష్ట్ర ప్రభుత్వానికి మన నిరసన తెలియజేస్తూ మెమోరాండం ఇచ్చాము. యూనివర్సిటీలు ఇచ్చిన నోటీసుకు వివరంగా సమాధానం ఇస్తూ ఎపిసిఎల్‌సీ లక్ష్య ప్రకటనలో, కార్యక్రమాలలో అధ్యాపకులు చేయకూడనిదేమీ లేదని వివరించాము.

మన సంస్థ బాధ్యులిద్దరు ఎం.ఎల్ పార్టీలనుండి కూడ బెదిరింపులు ఎదుర్కొన్నారు. మెదక్ జిల్లా శాఖ కార్యకర్త (ప్రస్తుతం ఆ జిల్లా శాఖ కో-కన్వీనర్) అయిన అశోక్ కుమార్‌ను జనశక్తి మిలిటెంట్స్ బెదిరించగా, కర్నూలు జిల్లా శాఖ ఉపాధ్యక్షుడు డా॥గౌరీనాథ్‌ను వేంపెంట గ్రామానికి చెందిన 'ప్రతిఘటన' పార్టీ అనుయాయులు (మొన్నటి మారణకాండకంటె ముందే) బెదిరించారు. అశోక్ కుమార్ విషయంలో మనం జనశక్తి మిలిటెంట్ల బెదిరింపులను బహిరంగంగా ఖండించి, ఆ పార్టీ నాయకులతో మాట్లాడి అతనికేమీ హాని జరగదన్న హామీ తీసుకున్నాం. గౌరీనాథ్ విషయంలో ప్రతిఘటన పార్టీ నాయకులకు కబురుచేశాము గానీ ముఖ్యులతో ఇంకా మాట్లాడడం జరగలేదు.

ప్రజాఉద్యమాలూ, ఉద్యమపార్టీలూ ఏం చేసినా బహిరంగ విమర్శ పెట్టకూడదని సంస్థ నిర్ణయం తీసుకొన్న నేపథ్యంలో భవిష్యత్తులో ఇటువంటివి జరిగితే ఏ విధంగా వ్యవహరించాలో నిర్ణయించుకోవలసిన అవసరం ఉంది.

## నియమావళికి సవరణలు :

సంస్థ నియమావళికి ఈ క్రింది సవరణలు సూచిస్తున్నాము.

(i) మొదట్లో చెప్పినట్టు, సంస్థ మహాసభలు రెండు సంవత్సరాలకొకసారి జరపడం మాత్రమే ఆచరణసాధ్యం. కాబట్టి నిబంధనావళిలోని అంశం 8 (నియమావళి) ని ఈ విధంగా సవరించాలని ప్రతిపాదిస్తున్నాం.

**అంశం 8 (4) : పౌరహక్కుల సంఘానికి రాష్ట్ర మహాసభ అత్యున్నతమైన సంస్థ. రాష్ట్ర మహాసభ రెండు సంవత్సరాలకొకసారి జరగాలి.**

(ii) అదే విధంగా, జిల్లా మహాసభలు రాష్ట్ర మహాసభలకంటే ముందే పూర్తయితే మంచిది కాబట్టి ఈ సవరణ ప్రతిపాదిస్తున్నాం.

**అంశం 8 (9) : జిల్లా మహాసభలు రెండు సంవత్సరాలకొకసారి జరగాలి. రాష్ట్ర మహాసభలకంటె 15 రోజుల ముందే జరగాలి. జిల్లా మహాసభలలో సభ్యులందరూ పాల్గొనవచ్చును.**

(iii). ప్రస్తుత నియమావళి ప్రకారం ఒక్కొక్క జిల్లానుండి రాష్ట్ర మహాసభలకు 15 మంది మాత్రమే డెలిగేట్లు రాగలరు. సభ్యుల సంఖ్య ఎక్కువగా ఉన్న జిల్లాలకు ఎక్కువ డెలిగేషన్ ఉంటే బాగుంటుంది కాబట్టి ఈ సవరణ ప్రతిపాదిస్తున్నాం.

**అంశం 8(5) : ఒక్కొక్క జిల్లా నుండి రాష్ట్ర మహాసభకు 15 మంది రావచ్చును. జిల్లా శాఖ సభ్యులు 30 మందికంటే ఎక్కువ వుంటే, 30 కంటే ఉన్న ప్రతీ ముగ్గురికీ ఒకరు చొప్పున అదనంగా డెలిగేట్లు రావచ్చును.**

**జిల్లా శాఖ సభ్యులలో మహిళలు ఎంతమంది ఉన్నా వారందరినీ డెలిగేషన్‌లో ఎంపికచేయాలి.**

## నిర్మాణం :

గత రాష్ట్ర మహాసభలనాటికి సంయుక్త శాఖలు రెండున్నాయి. నిజామాబాద్ - ఆదిలాబాద్ జిల్లాల సంయుక్త శాఖ ఒకటి, కరీంనగర్-మెదక్ జిల్లాల సంయుక్త శాఖ ఒకటి. రంగారెడ్డి జిల్లాకి కమిటీ లేదు. రంగారెడ్డి జిల్లాకు ఇప్పుడు కూడ కమిటీ లేదు. అయితే మెదక్ జిల్లాశాఖ ఇప్పుడు స్వతంత్ర కమిటీగా ఉంది. కరీంగనర్-ఆదిలాబాద్ జిల్లాల సంయుక్త శాఖ ఒక్కటే ఇప్పుడు సంయుక్త శాఖగా ఉంది.

మరొక చెప్పుకోదగ్గ విషయం, 'స్వేచ్ఛ' చాలాకాలం ఎదుర్కొన్న నిర్వహణ సమస్యలను అధిగమించి ఈ రెండున్నర

సంవత్సరాలుగా రెగ్యులర్‌గానే వస్తుండడం. అయితే ఇప్పటికీ పత్రికకు రాసేవాళ్లు ఇద్దరు ముగ్గురు మాత్రమే ఉండడం దురదృష్టకరం. ఇంకా ఎక్కువమంది రాసేటట్టయితే నిర్వహణ మరింత సులభం అవుతుంది. జిల్లా శాఖలు చేపట్టిన సమస్యలపైన సృజనాత్మకంగా రిపోర్టులు పంపించమని స్వేచ్ఛ సంపాదకవర్గం కోరినప్పటికీ ఎక్కువ స్పందన లేదు.

**ముగింపు :**

దేశంలోనూ, రాష్ట్రంలోనూ నెలకొని ఉన్న పౌరహక్కుల పరిస్థితిని వివరంగా సమీక్షించడం ఇక్కడ నా ఉద్దేశ్యం కాదు గానీ రెండు ముఖ్యమైన విషయాలనూ వాటి పర్యవసానాలనూ మాత్రం పేర్కొనవలసి ఉంది.

ఒకటి, అప్రతిహతంగా సాగుతున్న దేశ ఆర్థిక పునర్వ్యవస్థీకరణ. హక్కుల స్థితిగతులకిది ఒక ముఖ్య నేపథ్యాన్ని నిర్దేశిస్తుంది. పెట్టుబడికి వచ్చే లాభాలను ఏకైక ప్రమాణం చేసుకొన్న ఆర్థిక విధానం ప్రజల జీవితాలకు గానీ జీవనానికి గానీ భరోసా ఇవ్వజాలదు. హైదరాబాద్‌లో ఆల్విన్, రిపబ్లిక్ ఫోర్జ్ ఫ్యాక్టరీల మూసివేత, రాష్ట్రంలో అనేక ప్రభుత్వ, సహకార రంగ ఫ్యాక్టరీల మూసివేత లేక విక్రయం, చాలా తరచుగా జరుగుతున్న కార్మికుల రిట్రెంచ్‌మెంట్‌లు, మిల్లుల మూసివేత 1997-98 సీజన్‌లో పెద్దఎత్తున జరిగిన పత్తిరైతుల ఆత్మహత్యలు, పదేపదే వినపడే చేనేత కార్మికుల దీనగాథలు ఇవన్నీ దీనికి నిదర్శనాలు. మనం ఈ అన్ని ఘటనల్లోనూ మన గొంతు వినిపించాము. కార్మికుల, రైతుల నిరసనల్లో పాల్గొన్నాము. పత్తి రైతుల ఆత్మహత్యలు ప్రభుత్వ నూతన ఆర్థిక విధానాలతో ముడిపడి ఉన్న విషయాన్ని ఎండగట్టాము. వరంగల్‌లోనూ హైదరాబాద్‌లోనూ సభలు నిర్వహించాము. ఈ ఆత్మహత్యలపైన జరిగిన ట్రిబ్యునల్ విచారణకు పౌరహక్కుల సంఘం బాధ్యులు, కార్యకర్తలు అన్ని జిల్లాలలోనూ సహకరించారు. పెట్టుబడి లాభాల వేటకు పెద్దపీట వేసే ఆర్థిక పునర్వ్యవస్థీకరణ ముందుకు పోయేకొద్దీ ఇటువంటి అనేక సమస్యలు వస్తాయి. నిరుద్యోగం, పేదరికం, ఆత్మహత్యలు, అభివృద్ధికి బలి అయ్యే నిర్వాసితుల సమస్యలు, తరగిపోయే సంక్షేమ వ్యయం వల్ల తగ్గిపోయే స్కాలర్‌షిప్పులు, మూసివేసే సంక్షేమ హాస్టళ్లు, ప్రభుత్వ ఆస్పత్రులు, ఇవన్నీ మానవ హక్కుల సమస్యలే, పౌరహక్కుల సమస్యలే. పోనుపోను ప్రజలు వీటిని మరింతగా ఎదుర్కొంటారు. ఇక్కడ పౌరహక్కుల ఉద్యమం తన పాత్రను స్పష్టంగా నిర్దేశించుకొని పని చేయవలసి ఉంటుంది.

ఇదొక కోణం కాగా, దేశ రాజకీయాలలో బలపడుతున్న హిందుత్వవాదుల బలం మరొక ముఖ్యకోణం. ఇక మీదట ఈ హిందుత్వవాదులు అధికారంలో ఉన్నా లేకున్నా దేశంలో ఒక బలమైన రాజకీయ శక్తిగానే ఉంటారు. వీళ్ల ప్రభావం దేశం మీద గణనీయంగా ఉంటుంది.

ఆ ప్రభావం అన్ని రకాలుగానూ అప్రజాస్వామిక ప్రభావం. ఈ హిందుత్వవాదుల అజెండాలో అతి ముఖ్యమైన విషయం మిలిటెంట్ హైందవ జాతీయవాదం. హైందవ జాతిని ఒక బలమైన జాతిగా రూపొందించాలన్నది వారి రాజకీయ కాంక్ష. జాతి బలమైనది కావాలంటే ఎవ్వరూ హక్కులు అడగకూడదు, అల్లరులూ ఆందోళనలూ చేయకూడదు. ఇది గోల్వాల్కర్ కాలంనుండి వీరి ప్రాపంచిక దృక్పథం. ఇందులో మైనారిటీల హక్కులకే కాదు, ఏ రకమైన ప్రజాతంత్ర కాంక్షలకూ చోటు లేదు. ఈ దృక్పథం ప్రజల ఆకాంక్షలకు ప్రగతిశీలకమైన మార్పుల ద్వారా సమాధానం చెప్పదు, అణచివేత ద్వారానే చెప్తుంది.

సరళీకృత ఆర్థిక విధానాలు ఈనాడు మన హక్కులకు ఆర్థిక నేపథ్యమైతే, హిందుత్వవాదం వాటి రాజకీయ సాంస్కృతిక నేపథ్యం. ఈ నేపథ్యం మొత్తంగానే అప్రజాస్వామికమైనది. దాని నుండి పుట్టే పౌరహక్కుల సమస్యలు చాలా తీవ్రంగా ఉంటాయి. వాటిని అర్థం చేసుకోవడానికీ, వాటిని ఎదుర్కొనడానికీ తగిన ఆలోచన, కార్యదక్షత, క్రమశిక్షణ పౌరహక్కుల ఉద్యమం అలవరచుకోవాలి. తన 25 సంవత్సరాల అనుభవంతో ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం అందుకు సిద్ధమవుతుందనే ఆశిద్దాం. దానికి దోహదం చేసే విధంగా మహాసభ ఈ నివేదికను చర్చించి నూతన కార్యవర్గానికి తగు సూచనలివ్వాలని కోరుకుంటూ మీ నుండి సెలవు తీసుకుంటున్నాను.

13-9-98 కె. బాలగోపాల్

హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి

# పౌరహక్కుల అవగాహన పైన చర్చ సారాంశం: రెండు ఆలోచనా సరళులు

## (1998 ఏప్రిల్ 11న రాష్ట్ర కార్యవర్గం ఆమోదించిన పత్రం)

అవగాహన పత్రాలలోనూ వాటిపైన జిల్లాలలో జరిగిన చర్చలోనూ ప్రధానంగా ముందుకొచ్చిన అభిప్రాయభేదాలను దిగువ వివరిస్తున్నాము. ఒక్కొక్క విషయంలోనూ అంగీకారం ఉన్న అభిప్రాయాలను ముందు చెప్పి ఆపైన విభేదాలను (i), (ii) అని విడిగా వివరించాము. ఈ రెండు ఆలోచనా సరళులపైన మే 8,9 తేదీలలో గుంటూరులో జరిగిన సర్వసభ్య సమావేశం మరింత వివరంగా చర్చించింది. 10వ తేదీన ఓటింగ్ జరపగా ప్రతీ అంశంలోనూ (i)వ ఆలోచనా సరళికి అత్యధిక భాగం కార్యకర్తలు (షుమారు 75 శాతం) వోటు వేసారు. సమావేశానికి హాజరయిన 273 మంది కార్యకర్తలలో 249 మంది వోటు వేసారు. రెండు సరళులకూ వోటు చేయనివారు అతి కొద్ది మంది,

*(1)* మనప్రణాళికలో రాసుకున్నట్టు మనం సమాజంలో ఉన్న అన్నిరకాల వ్యవస్థీకృత ఆధిపత్యాలకు వ్యతిరేకంగా కృషి చేస్తాము. రాజ్యం, స్వంత ఆస్తి, కులం, పురుషాధిక్యత మొదలైన ఆధిపత్య వ్యవస్థల వల్ల తలెత్తే హక్కుల లేమినీ అతిక్రమణనూ వ్యతిరేకిస్తాము. వాటికి వ్యతిరేకంగా పోరాడే హక్కుకు మద్దతు ఇస్తాము. ఈ పోరాటాల క్రమంలో సాధించుకున్న హక్కుల అమలుకోసం, విస్తరణ కోసం కృషిచేస్తాం. సాధించుకున్న హక్కులను అమలు చేసే బాధ్యత రాజ్యానికి ఉందని గుర్తించి వాటి అమలు కోసం రాజ్యంపైన ఒత్తిడి పెడతాము. *(ఇది అంగీకారం ఉన్న విషయం).*

**విభేదాలు :**

(i) అన్ని రకాల వ్యవస్థిత ఆధిపత్యాలకు వ్యతిరేకంగా మనం కృషి చేసినప్పటికీ, రాజ్యం ప్రయోగించే అణచివేతకూ ఉద్యమాలపైన రాజ్యం ప్రయోగించే హింసకూ కార్యక్రమాల ఎంపికలో ఎక్కువ ప్రాముఖ్యం ఇస్తాము. కారణాలు: (ఎ) రాజ్యం అన్ని ఇతర ఆధిపత్యాలనూ తన బల ప్రయోగంతో కాపాడే శక్తి కాబట్టి అది అన్నిటికంటే ప్రధాన ఆధిపత్యశక్తి; (బి) ఏ ఆధిపత్యం పోవాలన్నా ప్రజలు దానికి వ్యతిరేకంగా పోరాటం చేయక తప్పదు. వాళ్ళు పోరాడినప్పుడు రాజ్యం తన బలప్రయోగంతో వారిని అణచివేస్తుంది. అందువల్ల రాజ్యహింస అన్నిటికంటే ప్రధానమైన అణచివేత రూపం; (సి) ఇతర ఆధిపత్య వ్యవస్థలకు వ్యతిరేకంగా పోరాడే సంఘాలు (దళిత సంఘాలు, మహిళా సంఘాలు వగైరా) ఉన్నాయి గానీ రాజ్యహింసకు వ్యతిరేకంగా కృషి చేయడానికి పౌరహక్కుల ఉద్యమం తప్ప వేరే ఎవరూ లేరు.

(ii) మన కార్యక్రమాలలో ఏ ఒక్క వ్యవస్థిత ఆధిపత్యానికీ ప్రాధాన్యం ఇవ్వకుండ అన్నిటినీ ఒకే రకంగా చూస్తాము. కేవలం సమస్య తీవ్రతను బట్టి ప్రాధాన్యం ఇస్తాము. కారణలు: (ఎ) రాజ్యం తన బలప్రయోగంతో ఇతర సామాజిక ఆధిపత్యాలను కాపాడితే ఆ సామాజిక ఆధిపత్యాలు తాము కల్పించే సంస్కృతి ద్వారా రాజ్యానికి బలం చేకూరుస్తాయి కాబట్టి వీటిలో ఏది ప్రధాన ఆధిపత్యశక్తి అనేది తేల్చలేము; (బి) అన్ని పోరాటాలకూ రాజ్యంతో ఒకే మోతాదులో శత్రుత్వం గానీ ఒకే రకమైన సంబంధంగానీ ఉండదు. రాజ్యం సార్వభౌమత్వాన్ని సవాలు చేసే పోరాటాలకు రాజ్యం ప్రత్యక్ష శత్రువు. ఇతర పోరాటాలకు రాజ్యంకంటే సాంఘిక ఆధిపత్య శక్తులే (ఉదా: కులం, పితృస్వామ్యం, ప్రాంతం, మెజారిటీ మతం వగైరా) మొదటి శత్రువు. రాజ్యం ఒక్కొక్కసారి ఆ శత్రువుకు అనుకూలంగా ఉంటుంది గానీ ఒక్కొక్కసారి రాజ్యం కల్పించే ప్రజాతంత్ర అవకాశాలు పోరాటకారులకు ఉపయోగపడతాయి; (సి) ఇతర ఆధిపత్య శక్తులకు వ్యతిరేకంగా పోరాడే సంస్థలు వేరే ఉన్నాయా లేవా అనేది ముఖ్యం కాదు. అన్నిరకాల పీడితులకూ పోరాటాలకూ మనం ఒకే రకమైన చేయూతనిచ్చే విధంగా మన కార్యాచరణను రూపొందించుకోవాలి.

*(2)* మనం పోరాడే హక్కును కాపాడడానికే కాక, నిత్యజీవితంలో జరిగే హక్కుల అతిక్రమణకు వ్యతిరేకంగా కూడ కృషి చేస్తాం. *(అంగీకారం ఉన్న విషయం).*

**విభేదాలు :**

(i) ఎవరెంత కృషి చేసినా పోరాడనిదే నిత్యజీవితంలో హక్కులు అనుభవించడం ప్రస్తుత వ్యవస్థలో సాధ్యం కాదు కాబట్టి సంఘటితంగా పోరాడే చైతన్యాన్ని పెంపొందించడం మీద, పోరాడే హక్కు మీద మనం ఎక్కువ దృష్టి పెడతాం. పోరాడితేనే హక్కులు అనుభవించడం సాధ్యమవుతుందనే చైతన్యం ప్రజలకు కలిగిస్తాం.

(ii) పోరాటాల ఆవశ్యకతను గుర్తిస్తాము గానీ, సమాజంలో చాలామంది సంఘటితంగా పోరాడే స్థితిలో లేరని కూడా గుర్తిస్తాము. అసంఘటితంగా మాత్రమే ఆధిపత్యశక్తులతో ఘర్షణ పడగలవారు, అసలే పోరాటాలు చేయలేని స్థితిలో ఉన్నవారు సమాజంలో చాలామంది ఉన్నారు కాబట్టి పోరాడే హక్కుకు ఇచ్చినంత ప్రాముఖ్యం, నిత్యజీవితంలో హక్కులను అనుభవించే అవకాశాన్ని కాపాడడానికి కూడ ఇస్తాం. ఏ మేరకు సాధ్యమైతే ఆ మేరకు చేస్తాం.

*(3)* భారతదేశ రాజ్యాంగయంత్రానికి ప్రజాతంత్ర రూపం ఉంది. అందులోని ప్రజాస్వామిక విలువలు, హక్కులు, ప్రజల చారిత్రక పోరాట విజయాల ఫలితం. వాటిని ప్రజల చైతన్యంలో సజీవంగా ఉంచడానికి కృషి చేస్తాం. అవి చట్టరూపంలో ఉన్నమేరకు వాటిని అమలు చేయించడానికి కృషి చేస్తాం. దీనికి రాజ్యాంగయంత్రం కల్పించే అన్ని అవకాశాలనూ ఉపయోగించుకుంటాం. అయితే భారత రాజ్యాంగయంత్రంలోని ప్రజాస్వామ్యానికి స్వభావరీత్యా పరిమితులు ఉండడమే కాక, సామాజిక ఆర్థిక వ్యవస్థలోని ఆధిపత్యాల కారణంగా మరిన్ని ఆటంకాలున్నాయి. అందువల్ల తమ హక్కుల అమలు కోసమైనా మెరుగుదల కోసమైనా ప్రజలు పోరాటాలు చేయవలసిన అవసరం తరచుగా వస్తుంది. ప్రత్యామ్నాయ రాజ్యాంగ వ్యవస్థ కోరుకునే వారికైతే పోరాటాలు ఎట్లాగూ తప్పవు. మనం ఆ విషయాన్ని గుర్తించి పోరాడే హక్కుకు మద్దతు ఇస్తాం. *(ఇది అంగీకారం ఉన్న విషయం).*

**విభేదాలు :**

(i) భారత రాజ్యాంగ యంత్రంలోని ప్రజాస్వామ్యంలో గతకాలపు పోరాటాల ఫలితమైన విలువలు, సూత్రాలు ఎన్ని ఉన్నా ఆ రాజ్యాంగ యంత్రంపైన ఆధిపత్యవర్గాల పెత్తనం ఉండడం వల్ల (లేదా భారతదేశంలో ప్రజాతంత్ర విప్లవం అపరిపూర్ణం కావడం వల్ల, లేదా సామ్రాజ్యవాద దశలో ప్రజాస్వామ్యం ప్రజలకు దూరం కావడం వల్ల ) అందులోని ప్రజాస్వామ్యం పీడిత ప్రజలకు పెద్దగా అందదు. ఆ ప్రజాస్వామిక విలువలను ప్రజల చైతన్యంలో సజీవంగా ఉంచడానికి కృషి చేయగలుగుతాయే తప్ప రాజ్యాంగ వ్యవస్థలో ప్రజాస్వామ్యాన్ని పెంపొందించడానికి కృషి చేయడం వల్ల ప్రయోజనం ఉండదు. కాబట్టి ఆ ప్రజాస్వామ్యాన్ని ప్రజలకు అందించడాని ఏ మేరకు వీలైతే ఆ మేరకు కృషి చేస్తూనే, దానికి ఆటంకంగా ఉన్న (సామాజిక ఆర్థిక) వ్యవస్థాగతమైన పరిమితులను ప్రజలకు వివరించి చెప్పడం, వాటికి వ్యతిరేకంగా పోరాడే చైతన్యాన్ని పెంపొందించడం, పోరాటాలపైన రాజ్యం అమలు చేసే అణచివేతను ఎండగట్టడం మన ప్రధాన కర్తవ్యాలు.

(ii) ఎన్ని పరిమితులున్నప్పటికీ భారత రాజ్యాంగ యంత్రంలోని ప్రజాస్వామ్యం సూత్రప్రాయంగా అర్థవంతమైనది. అది పీడిత ప్రజలకు పనికిరాదనేది మనకు తగిన వైఖరి కాదు. దానిని అమలు చేయించడానికీ పెంపొందించడానికీ చేసే కృషి ఒక మేరకు ఫలితాన్ని ఇవ్వగలదు. మనం ప్రజల చైతన్యంలోనే కాక రాజ్యాంగ యంత్రంలో కూడా ప్రజాస్వామ్యం విలువలను నిలబెట్టడానికీ పెంపొందించడానికి కృషి చేస్తాం. దానికున్న సామాజిక ఆర్థిక ప్రతిబంధకాలను సందర్భం వచ్చినప్పుడు వివరిస్తాము గానీ వాటిని ఎండగట్టడమే మనకొక కర్తవ్యం కాదు. ప్రజాస్వామ్యాన్ని అమలు చేయించడానికీ పెంపొందించడానికీ మనం చేసే కృషిలో ఏ కొంచెం ఫలితం సాధించినా, ఆ రూపకంగానే మనం ప్రజలు నిత్యజీవితంలో హక్కులు అనుభవించడానికైనా ప్రజల పోరాటాలకైనా ప్రత్యామ్నాయ రాజ్యాంగ వ్యవస్థ రూపొందించుకునే కృషికైనా తోడ్పడగలుగుతాం.

*(4)* చట్టాలలో పీడిత ప్రజలకు హక్కులు కల్పించే అంశాలూ ఉంటాయి, ఆధిపత్యశక్తుల ప్రయోజనాలను కాపాడే అంశాలూ ఉంటాయి. కొన్ని హక్కులు కల్పిస్తూ మరికొన్ని హక్కులను అదే సమయంలో తీసేసే చట్టాలూ ఉంటాయి. మనం చట్టాలలోని మొదటి అంశాన్ని సమర్థిస్తాం, రెండో అంశాన్ని వ్యతిరేకిస్తాం. చట్టంలో ఉన్న హక్కులను, సంస్కరణలను, ప్రజాస్వామిక విలువలను ఆహ్వానిస్తాం, వాటి అమలుకోసం కృషి చేస్తాం. వాటిని కేవలం కాగితాలకు పరిమితం చేసే వైఖరిని, వాటిని చూపించి ఉద్యమాలను అణచివేయ చూసే వైఖరిని వ్యతిరేకిస్తాం. *(ఇది అంగీకారం ఉన్న విషయం).*

(i) చట్టంలో ఉన్న హక్కులు, సంస్కరణలు, ప్రజాస్వామ్య విలువలు రాజ్యానికి సాధికారత కలిగిస్తాయని గుర్తిస్తాం. వాటి అమలు కోసం ఆందోళన చేసేటప్పుడు ఈ ద్వంద్వ స్వభావాన్ని గురించి అప్రమత్తంగా ఉంటాం. దానిని ప్రజలకు వివరిస్తాం. ఉద్యమాలు పెట్టే ఒత్తిడి మేరకే, తన మనుగడను కాపాడుకోవడం కోసం మాత్రమే రాజ్యం పీడిత ప్రజలకు హక్కులు ఇస్తుందని గుర్తిస్తాం.

(ii) చట్టంలో ఉన్న హక్కులు, సంస్కరణలు, ప్రజాస్వామిక విలువలు కూడా రాజ్యంలో భాగమే కాబట్టి వాటివల్ల రాజ్యానికి వచ్చే సాధికారత గురించి మనం బాధపడనక్కరలేదు. వాటిని అప్పటి పాలకులు ఎందుకోసం కల్పించినా అవి ఏ మేరకు ఉంటే ఆమేరకు రాజ్యాన్ని ప్రజాస్వామీకరించి ప్రజలకు నిజమైన హక్కులు కల్పిస్తాయని గుర్తిస్తాం. ఉన్నదాని కంటే ఎక్కువ ఉందని చూపించి అబద్ధపు సాధికారత పొందే ప్రయత్నాన్ని గురించి మాత్రమే మనం అప్రమత్తంగా ఉంటాం.

*(5)* మనం పోరాడే హక్కుకు మద్దతు ఇస్తాం. పోరాటాలు ముందుకు తీసుకొచ్చే ప్రజాస్వామిక లక్ష్యాలను గుర్తించి వాటిని సమాజం చేత గుర్తింపజేయడానికి కృషి చేస్తాం. పోరాటాలపైన ప్రభుత్వం, పెత్తందారీ శక్తులు ప్రయోగించే అణచివేతను వ్యతిరేకిస్తాం. పోరాటాల వ్యూహాలతోనూ, పంథాతోనూ మనకు సంబంధం లేదు. వాటిని సమర్థించడం గానీ విమర్శించడం గానీ మన పని కాదు. (ఇది అంగీకారం ఉన్న విషయం).

**విభేదాలు :**

(i) పోరాటకారుల చర్యలలో ఏవైనా అప్రజాస్వామిక ధోరణులు తలెత్తినా కూడ వాటిని మనం బహిరంగంగా విమర్శించడం తప్పు. ఏది అప్రజాస్వామికం, ఏది ప్రజాస్వామికం అని నిర్ణయించడం పోరాటాలకు వెలుపల ఉన్న మనకు సాధ్యంకాదు. పైగా అది పోరాటస్ఫూర్తిని నీరుగార్చి రాజ్యహింసకు పరోక్షంగా బలం చేకూరుస్తుంది. ఒకవేళ ఎప్పుడయినా విమర్శించడం తప్పనిసరి అనుకుంటే ఆ పోరాటకారులకే చెప్పాలి తప్ప బహిరంగంగా విమర్శించకూడదు.

(ii) మనం ప్రధానంగా ప్రజలకు జవాబుదారులం కాబట్టి ఉద్యమకారులు పాల్పడే అప్రజాస్వామిక చర్యలను ప్రజాముఖంగా, బహిరంగంగా విమర్శించాలి. అది మననైతిక బాధ్యతేకాక ప్రజాతంత్ర ఉద్యమంలో భాగంగా మన కర్తవ్యం కూడా. ప్రజాస్వామ్య విలువల గురించి మన కార్యరంగంలో భాగంగా మనకు అవగాహన ఉంది కాబట్టి ఉద్యమకారుల చర్యలను ఆ కోణం నుండి విమర్శించడం మనకు సాధ్యమే. ఇది వారు పాల్పడే అన్ని చర్యలకూ వర్తిస్తుంది-ఇన్‌ఫార్మర్ల పేరిట జరిగే హత్యలు, ఉద్యమసంస్థలలో స్త్రీలపైన లైంగిక వేధింపులు మొదలయిన వాటికన్నిటికీ వర్తిస్తుంది.

*(6)* కేవలం కొన్ని రాజకీయభావాలు కలిగి వున్నందుకు, ప్రచారం చేసినందుకు , ఒక పార్టీలో లేక సంస్థలో సభ్యులయినందుకు ఎవరిమీదనైనా కేసులు పెడితే వ్యతిరేకిస్తాం. అటువంటి కేసులు ఎత్తివేయాలని ఆందోళన చేస్తాం. రాజకీయ ఖైదీలకు ఇతర ఖైదీలకు ఇచ్చే హక్కులు ఇవ్వకుండ వివక్ష పాటిస్తే వ్యతిరేకిస్తాం. మొత్తంగా ఖైదీల హక్కుల మెరుగుదల కోసం కృషి చేస్తాం (ఇది అంగీకారం వున్న విషయం).

**విభేదాలు :**

(i) రాజకీయ ఖైదీలను (ప్రజాతంత్ర ఉద్యమ సంస్థలకు, పార్టీలకు చెందినవారు) బేషరతుగా విడుదల చేయాలనేది పౌరహక్కుల డిమాండే. ఆ డిమాండుతో ఒక ప్రజా ఉద్యమం ముందుకొస్తే దానిలో మనం పాల్గొంటాం.

(ii) ఆ డిమాండ్ చేసే హక్కును మనం ఒక రాజకీయ హక్కుగా గుర్తిస్తాం. అంతే తప్ప మనం అటువంటి ఉద్యమంలో పాల్గొనం. అది పౌరహక్కుల డిమాండు కాదు.

*(7)* ప్రభుత్వం మీద ఒత్తిడి పెట్టడానికైనా ప్రజలను చైతన్యవంతులు చేయడానికైనా మనం ఒంటరిగా ఆందోళన చేపడితే మనశక్తి సరిపోదుగాబట్టి అవకాశం వున్నప్పుడు ఆ విషయంలో భావసారూప్యత గల ఇతర సంస్థలతో కలిసి ఐక్య కార్యాచరణ రూపొందించుకోవడం అవసరం. ఐక్య కార్యాచరణ చేపట్టే క్రమంలో మన ఐడెంటిటీని కాపాడుకుంటాం. ఐక్య కార్యాచరణ విస్తృత ప్రాతిపదికన చేపడతాం. (ఇది అంగీకారం వున్న విషయం).

**విభేదాలు :**

(i) పౌరహక్కుల పరిధిలో మనకు ఆమోదనీయమైన డిమాండ్లతో ఇతర పౌరహక్కుల సంఘాలతోనే కాక మనతో ఎవరు కలిసి వచ్చినా వారితో కలిసి ఐక్య కార్యాచరణ చేపడతాం. కార్యక్రమాల అమలులోగాని, డిమాండ్లలోగాని మన పరిధికి, అవగాహనకు భిన్నమైన పోకడలు ఐక్యకార్యాచరణ క్రమంలో ముందుకొస్తే వాటిని వివరించి, సవరించే ప్రయత్నం చేస్తాం. అది సాధ్యం కానప్పుడు మనం రిజర్వేషన్‌తో ఐక్యకార్యాచరణలో కొనసాగడం గానీ, బయటకు రావడం గానీ చేస్తాం. అంతే తప్ప హింసకు పాల్పడుతున్నారనే పేరు మీద ఎం.ఎల్ పార్టీల ప్రజాసంఘాలతో మనం ఐక్య కార్యాచరణ చేపట్టకూడదనడం తప్పు.

(ii) మన కార్యక్రమాలలో పౌరహక్కుల ఉద్యమానికుండే ప్రత్యేకమైన ఐడెంటిటీని కాపాడుకోవడం అవసరం. కాబట్టి దీర్ఘకాలిక పౌరహక్కుల డిమాండ్లతో మనం పౌరహక్కుల సంఘాలతోనే తప్ప ఇతర ప్రజా సంఘాలతో ఐక్య కార్యాచరణ చేపట్టకూడదు. నిర్దిష్టమైన, స్వల్పకాలిక డిమాండ్లయితే ఫర్వాలేదు. అప్పుడు కూడా పౌరహక్కుల దృక్పథానికీ విలువలకూ విశ్వసనీయతకూ భంగం కలగకుండా చూసుకోవాలి. ఎం.ఎల్ పార్టీల పోరాటాలపైన అమలయ్యే నిర్బంధానికి వ్యతిరేకంగా ఆందోళన చేసేటప్పుడు, హింసకు పాల్పడుతున్న ఆ పార్టీల ప్రజాసంఘాలతో ఐక్య కార్యాచరణ చేపట్టడం మన విశ్వసనీయతకు భంగకరం. వారితో ఇతర విషయాలలో (నిర్దిష్టమైన, స్వల్పకాలిక డిమాండ్లపైన) ఐక్య కార్యాచరణ చేపట్టవచ్చు.